ప్రజాశక్తి

శుక్రవారం 31 మే 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

లెక్కింపు ఏర్పాట్లలో తలమునకలు

- బిజీబిజీగా అధికార యంత్రాంగం
- స్ట్రాంగ్ రూమ్ వద్ద కమాండ్ కంట్రోల్ గదులు
- అక్కడ నుంచే అభ్యర్థులు కౌంటింగ్ ప్రక్రియ పరిశీలన

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు గడువు సమీపిస్తోంది. మరో నాలుగు రోజుల సమయమే వుండడంతో లెక్కింపు ఏర్పాట్లలో అధికార యంత్రాంగం తలమునకలైవుంది. జూన్ 4న ప్రశాంతంగా లెక్కింపు ప్రక్రియను ముగించాలన్న యోచనలో యంత్రాంగం వుంది. ఈ క్రమంలోనే ఎటువంటి అనుమానాలు, వివాదాలకూ తావులేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. అభ్యర్థులు పదేపదే లెక్కింపు చోటకు వెళ్లకుండా క్లాక్‌వైజ్ వెబ్ కాస్టింగ్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లు రెండు సిద్ధం చేస్తున్నారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద పోస్టల్ బ్యాలెట్, ఇవిఎంల లెక్కింపు జరుగుతున్న తీరును కమాండ్ కంట్రోల్ గదుల నుంచి పరిశీలించవచ్చు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి రవి పట్టాన్‌శెట్టి వేర్వేరుగా రెండు కమాండ్ కంట్రోల్ గదులను సిద్ధం చేయాలని సూచించారు. ఒక కమాండ్ కంట్రోల్ గది నుంచి ఎన్నికల పరిశీలకులు, ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారులు లెక్కింపును పరిశీలించి ఎప్పటికప్పుడు సూచనలు ఇవ్వనున్నారు. మరొక గదిలో ఓట్ల లెక్కింపును ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పరిశీలించేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు.. అభ్యర్థులెవరికి లెక్కింపులో ఎటువంటి అభ్యంతరాలున్నా వెంటనే మిగతా 2లో..

సత్తా చాటారు

ఎపి ఈసెట్‌లో ప్రతిభ చూపిన విశాఖ, అనకాపల్లి విద్యార్థులు

గురువారం విడుదలైన ఎపి ఈసెట్ ఫలితాల్లో విశాఖ, అనకాపల్లి విద్యార్థులు సత్తా చాటారు. రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించడంతో వారిని పలువురు అభినందించారు.

ప్రజాశక్తి - గాజువాక : ఎపి ఈసెట్ ఫలితాల్లో యారాడ గ్రామానికి చెందిన బంక మనోహర్ రాష్ట్ర రెండో ర్యాంకు సాధించాడు. ఆయన తండ్రి గురునాథరావు సెక్యూరిటీ గార్డు, తల్లి పాపాజీ గృహిణి. మనోహర్ పదో తరగతి వరకు మల్కాపురంలోని సరస్వతి పాఠశాలలో చదివాడు. తొలి నుంచీ విద్యలో ముందుండేవాడు. తర్వాత కంచరపాలెంలోగల డిప్లొమా ఇన్ కెమికల్‌లో ప్రవేశించి ఇప్పుడు ఈసెట్ ఫలితాల్లో సత్తా చాటాడు. తెలంగాణ ఈసెట్ ఫలితాల్లో సైతం స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించి విశాఖ మిగతా 2లో..



తల్లిదండ్రులతో మనోహర్



విశాఖలో సిఐటియు పతాకాన్ని ఎగురవేస్తున్న కుమారమంగళం



అనకాపల్లిలో జరిగిన వేడుకల్లో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

ఘనంగా సిఐటియు ఆవిర్భావ దినోత్సవం

వాడవాడలా ఎగిరిన కార్మిక పతాక

వార్తలు 4లో..

మొదటి పేజీ తరువాయి..



అనకాపల్లిలో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ కమాండ్ కంట్రోల్ రూమ్

లెక్కింపు ఏర్పాట్లలో తలమునకలు

తెలియజేస్తే వాటిని నివృత్తి చేయనున్నారు. అభ్యర్థులు ప్రతిసారీ తన నియోజకవర్గ ఓట్ల లెక్కింపు టేబుల్స్ వద్దకు వెళ్లాల్సిన అవసరంలేకుండా కంట్రోల్ రూమ్ నుంచే తెలుసుకొనేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నారు. గతంలో ఈ తరహా కంట్రోల్ రూమ్‌లు లేవు. ప్రశాంత కౌంటింగ్‌కు పోలీసు, రెవెన్యూ యంత్రాంగం సమన్వయంతో వ్యవహరిస్తున్నాయి. ఎన్నికల అధికారి లెక్కింపు దగ్గరకు వెళ్లకుండా కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షించడం మరింత సులభతరమవుతుంది. సిసి కెమెరా నిఘాలో లెక్కింపు వుంటుంది. లెక్కింపు మొత్తం రికార్డు కానుంది. ఇప్పటికే లెక్కింపు సిబ్బందికి తొలి దశ ర్యాండమైజేషన్ పూర్తికాగా, రెండో దశ ర్యాండమైజేషన్ జూన్ 2న, చివరిగా లెక్కింపు రోజున ఉదయం 5 గంటలకు జరగనుంది. లెక్కింపు వ్యహారమంతా పరిశీలకులు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సహాయక రిటర్నింగ్ అధికారులు, ఆయా పార్టీల ఏజెంట్ల సమక్షంలో జరగనుంది. అదే సమయంలో సాంకేతిక కారణాలతో ఇవిఎంల లెక్కింపులో ఏమైనా సమస్యలు ఏర్పడితే వెంటనే పరిష్కరించేందుకు బెల్ ఇంజినీర్లను అందుబాటులో వుంటారు. ఇవిఎం ఓపెన్ కాకపోయినా, మధ్యలో ఆగిపోయినా అది సమస్యగా మారకుండా సాధారణ స్థితికి తీసుకొచ్చేలా నిపుణులను సిద్ధం చేశారు.

సత్తా చాటారు

కీర్తిప్రతిష్టలను చాటిచెప్పాడు. భవిష్యత్తులో గేట్ సాధించడమే తన లక్ష్యమని మనోహర్ 'ప్రజాశక్తి'కి తెలిపాడు.

అనకాపల్లి : ఎపి ఈసెట్ ఫలితాల్లో అనకాపల్లి విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అనకాపల్లి మండలం రొంగలివానిపాలెం గ్రామానికి చెందిన మేడిశెట్టి వైభవ్ మూడో ర్యాంకు, అనకాపల్లి విజయరామరాజుపేటకు చెందిన భీశెట్టి దివాకర్ ఏడో ర్యాంకు సాధించారు. దివాకర్ విశాఖపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చదివాడు. వారిని పలువురు అభినందించారు.

న్యాయం కోసం మాజీ మిస్ వైజాగ్ నక్షత్ర ఆందోళన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : తన భర్త తేజ నిత్యం వేధిస్తున్నాడని, తనకు న్యాయం చేయాలని కోరుతూ మాజీ మిస్ వైజాగ్ నక్షత్ర విశాఖ నగరంలోని దసపల్లా హిల్స్‌లోని భర్త ఆఫీస్ ఎదుట గురువారం ఆందోళన చేపట్టింది. అంతకుముందు ఆమె భర్త తేజ ఓ గదిలో మరో మహిళతో కలిసి ఉండగా పోలీసులు, మీడియా ప్రతినిధులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అప్పగించింది. అనంతరం తనకు న్యాయం చేయాలని నినదించింది. తనకు విడాకులు ఇవ్వకుండా మరో స్త్రీని పెళ్లి చేసుకొని కాపురం చేస్తున్నాడని ఆమె పేర్కొంది. 2013లో ఓ సినిమా షూటింగ్‌లో తనకు తేజతో పరిచయమైందని, 2017లో ప్రేమించి పెళ్లి చేసుకున్నామని చెప్పింది. తమకు ఒక పాప ఉందని పేర్కొంది. నేవల్ డాక్‌యార్డ్ ఉద్యోగి అయిన తేజ ప్రవర్తన బాగోలేక విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు ఆమె తెలిపారు. అంతేగాకుండా తన భర్త తేజ పబ్జీ గేమ్, క్లబ్ హౌస్ యాప్‌ల ద్వారా అమ్మాయిలను ట్రాప్ చేసి వారిని శారీరకంగా వాడుకుంటూ ఉంటాడని ఆరోపించింది. అనంతరం తేజ మీడియాతో మాట్లాడుతూ తను సినిమాలకు సహా దర్శకునిగా పనిచేస్తున్నానని, ఇది తన ఆఫీస్ అని తెలిపాడు. తనతో పాటు ఆఫీస్‌లో ఉన్న అమ్మాయి సినిమా ఆడిషన్‌కి వచ్చిందని చెప్పాడు. చుట్టుపక్కల వారు అందించిన వివరాల ప్రకారం ఈ ఫ్లాట్ మూడు నెలల క్రితం సినిమా ఆఫీస్ కోసం అద్దెకు తీసుకున్నామన్నారు. ఇదిలా ఉండగా తేజతో రూమ్‌లో ఉన్న యువతి ప్రముఖ రాజకీయ నాయకుని కుమార్తె అని తెలుస్తోంది.

విభిన్న ప్రతిభావంతుల గుర్తింపునకు ప్రత్యేక సర్వే



సర్వే నిర్వహిస్తున్న డిఇఒ చంద్రకళ

ప్రజాశక్తి - ఎంవిపి. కాలనీ : సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకుల ఆదేశాల మేరకు మహారాణిపేట మండలంలో నిర్వహిస్తున్న 18 ఏళ్లలోపు బడి బయట ఉన్న విభిన్న ప్రతిభావంత పిల్లల గుర్తింపు నమోదు సర్వే కార్యక్రమాన్ని డిఇఒ చంద్రకళ గురువారం పర్యవేక్షించారు. విభిన్న ప్రతిభావంత పిల్లలకు భవిత కేంద్రాల ద్వారా అందిస్తున్న చదువు, ఫిజియోథెరపీ సేవలు, ప్రభుత్వం ద్వారా వచ్చే ఉపకార వేతనాలు, ఇతర రాయితీల వివరాలను వారి తల్లిదండ్రులకు వివరించారు. ఈ సర్వే జూన్ 9 వరకు కొనసాగుతుందని ఎంఇఒ పైడపు నాయుడు, బి.పుష్యరాగం తెలిపారు. మండలంలో ఇప్పటివరకు చేపట్టిన సర్వేలో 20 మంది బాలలను గుర్తించి వారి వివరాలు నమోదు చేశామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహిత విద్య సమన్వయకర్త బి.గీత, ఎఎండి జి.లక్ష్మితో పాటు ప్రత్యేక ఉపాధ్యాయులు పి.శ్వేతలత, డి.ప్రతిమ, ప్రియ పాల్గొన్నారు.

రక్తదానం గొప్పది



అల్లూరి విజ్ఞాన కేంద్రంలో రక్తదానం చేస్తున్న రక్షణరంగ ఉద్యోగులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అన్ని దానాల కంటే రక్తదానం గొప్పదని, విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి ఉత్సవాల్లో భాగంగా ఆ వీరున్ని స్మరించుకుంటూ రక్తదానం చేస్తున్న రక్షణ రంగ కార్మికులు అభినందనీయులని లయన్ ప్రొఫెసర్ ఎన్‌విఎన్.దుర్గాప్రసాద్‌రావు అన్నారు. సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ, అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గురువారం డాబాగార్డెన్స్ సమీపంలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ రక్తదానం ఆవశ్యకతను తెలియజేశారు. దేశంలో వామపక్ష భావజాలం బాగా ఉన్న పశ్చిమబెంగాల్, కేరళ రాష్ట్రాలలో మాత్రమే అవసరమైనంత రక్తం దాతల నుండి దొరుకుతోందని, మిగతా దేశమంతటా సరైన సమయంలో రక్తం లేకపోవడం వల్ల రోగులకు ఇబ్బందులు వస్తున్నాయని చెప్పారు. లయన్స్ ఇంటర్నేషనల్ లాగానే సిఐటియు నాయకులు సేవాతత్పరత కలిగి ఎల్లప్పుడూ సేవా కార్యక్రమాలు చేపడతారని అన్నారు. కార్మిక ఐక్య ఉద్యమాలను నిర్మించాలని కోరారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకటరావు మాట్లాడుతూ అల్లూరి ఆశయాలను పక్కన పెట్టి నేటి పాలకులు సామ్రాజ్యవాదులకు, బహుళజాతి కార్పొరేట్ శక్తులకు సేవ చేస్తున్నారన్నారు. ఆ విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. విశాఖ రక్షణ రంగంలో డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ భాగస్వామ్య పక్షాలు సంవత్సరంలో మూడు సార్లు రక్తదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి వై.ఆంజనీ రాజేష్ వందన సమర్పణ చేయగా నాగేశ్వరరావు, భాను, శేఖర్, మోహన్, కాశీం, స్వామి, జగదీష్, నాగార్జున, రాజారావు, శ్రీనివాసరావు, అనిల్ రెడ్డి పాల్గొన్నారు. 50 మంది దాతలు రక్తదానం చేశారు.

భూముల వ్యవహారంపై సిఎస్ చర్చకు సిద్ధమా ?

ప్రజాశక్తి - సీతమ్మధార : భూముల కాజేతకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్ రెడ్డి తనతో చర్చకు సిద్ధమా ? అని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ సవాలు విసిరారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో 596 జిఒను సాకుగా చేసుకొని బినామీల ద్వారా వందల ఎకరాల భూములను కొట్టేశారనే ఆరోపణలను రుజువు చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని అన్నారు. ఆయన ఇచ్చే లీగల్ నోటీసులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. గురువారం విశాఖలో విలేకరులతో మూర్తియాదవ్ మాట్లాడుతూ అన్నవరం సమీపంలోని ఎ -1 హోటల్ అధినేత చోడ్రాజు సత్యకృష్ణంరాజు, విశాఖకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి పేరిచర్ల శ్రీనివాసరాజులు జవహర్ రెడ్డికి బినామీలుగా వ్యవహరించారని అన్నారు. సూర్రెడ్డి త్రిలోక్ జవహర్ రెడ్డి వ్యవహారాలకు బ్రోకర్ అని ఆరోపించారు. వందల కోట్ల లావాదేవీలు, వందల ఎకరాల వ్యవహారాలు చోడ్రాజు సత్యకృష్ణంరాజుతో జవహర్ రెడ్డి చేయడం వల్లే గత నెల 17న కృష్ణంరాజు క్యాన్సర్‌తో మృతిచెందితే జవహర్ రెడ్డి ఆఘమేఘాల మీద అన్నవరం వచ్చారని అన్నారు. కృష్ణంరాజు కుటుంబం మీద ఎటువంటి సానుభూతీ చూపకపోగా లావాదేవీలకు సంబంధించిన సెటిల్‌మెంట్ల కోసం కుటుంబీకులకు తీవ్ర ఒత్తిడి చేశారన్నారు. విశాఖలోని చారిత్రాత్మక ఎర్రమట్టిదిబ్బల ప్రాంతానికి డి పట్టాలు ఇచ్చి వాటిని కాజేసిన వ్యక్తి కూడా జవహర్ రెడ్డేనని ఆరోపించారు.

పలు రైళ్లు రద్దు, దారి మళ్లింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పలు కారణాలతో రైల్వే అధికారులు ఒక రైలును రద్దు చేసి, మరికొన్నింటిని దారి మళ్లించారు. ఈ మేరకు లండింగ్ డివిజన్‌లోని న్యూ హాఫ్లాంగ్ - బందర్‌ఖల్ రైల్వే స్టేషన్ మధ్య ట్రాక్ సస్పెన్షన్ కారణంగా 12513 సికింద్రాబాద్ - సిల్చార్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను జూన్ 01న రద్దు చేశారు. సంబల్‌పూర్ డివిజన్‌లోని సంబల్‌పూర్ - జార్సుగూడ సెక్షన్ మీదుగా సరళ స్టేషన్‌లో సరుకు రవాణా పరీక్షా మార్గాన్ని ప్రారంభించడం కోసం ప్రీ-నాన్ ఇంటర్ లాకింగ్, ఇంటర్ లాకింగ్ వర్క్‌ల కారణంగా ఎర్నాకులం నుంచి బయలుదేరే 18190 ఎర్నాకులం - టాటా ఎక్స్‌ప్రెస్ జూన్ 6 నుంచి 12వ తేదీ వరకు విజయనగరం, ఖుర్దా రోడ్, కటక్, జఖాపురా, జరోలి మీదుగా మళ్లించబడుతుంది. టాటా నుంచి బయలుదేరే 18189 టాటా - ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ జూన్ 7 నుండి 14 వరకు జరోలి, జఖాపురా, కటక్, ఖుర్దా రోడ్, విజయనగరం మీదుగా మళ్లించబడుతుంది. కావున ఈ రైళ్లకు బొబ్బిలి, పార్వతీపురం, రాయగడ, మునిగూడ, అంబోదల, కేసింగ, టిట్లాగఢ్, బలంగీర్, బర్గర్ రోడ్, సంబల్‌పూర్, ఝుర్సుగూడ, బ్రమా, రాజ్ గ్యాంగ్‌పూర్, రూర్కెలా, జరైకేలా, గోయిల్‌కేరా, చక్రధర్ పూర్ స్టాప్‌లను తొలగించారు.

స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ తప్పనిసరి



మాట్లాడుతున్న రాజారత్నం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, విశాఖ కలెక్టరేట్ : జూన్ 12 నుంచి పాఠశాలలు పున:ప్రారంభమవుతున్నందున స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలను ఆలోగా పూర్తి చేసుకోవాలని స్కూళ్లు, కళాశాలల యాజమాన్యాలకు జిల్లా ఉప రవాణా కమిషనర్ రాజారత్నం సూచించారు. గురువారం విశాఖలోని ఉప రవాణా కమిషనర్ కార్యాలయంలో స్కూలు, కళాశాల బస్సుల యాజమాన్యాలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ స్కూలు, కళాశాల బస్సులలో డ్రైవర్లుకు కనీసం 5 సంవత్సరాల అనుభవం ఉండాలన్నారు. 50 సంవత్సరాల వయస్సు మించరాదని తెలిపారు. డ్రైవర్లకు విధిగా కంటి ఆరోగ్య పరీక్షలు చేయించాలన్నారు. త్రైమాసిక పన్నులు బస్సుల సిటింగ్ పరిమితిని బట్టి కట్టాల్సి ఉందన్నారు. స్కూలు బస్సులో తప్పనిసరిగా ఒక సహాయకుడు ఉండాలని సూచించారు. ప్రతి స్కూలు యాజమాన్యం రహదారి భద్రతకు సంబంధించిన ఒక కమిటీని ఏర్పాటు చేయాలని, ఆ కమిటీ నెలకొకసారి సమావేశం నిర్వహించాలని సూచించారు. స్కూలు ఆటోలలో ఆరుగురు విద్యార్థులు మాత్రమే ఉండేలా చూడాల్సిన బాధ్యత యాజమాన్యాలదేనన్నారు.

12 నుంచి స్పెషల్ డ్రైవ్

పాఠశాలలు, కళాశాలల బస్సులపై జూన్ 12 నుండి 30వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్టు రాజారత్నం తెలిపారు. ఫిట్‌నెస్ చేయని బస్సులను సీజ్ చేయడంతో పాటుగా పాఠశాల, కళాశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు యూనియన్ బ్యాంక్ రిటైల్ ఎక్స్‌పో

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రముఖ ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన శుక్రవారం నగరంలోని బుల్లయ్య కళాశాల సమీపంలోని అంబేద్కర్ భవన్‌లో రిటైల్ ఎక్స్‌పో నిర్వహించనున్నారు. ఈ మేరకు బ్యాంక్ అధికారులు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఎక్స్‌పోలో భాగంగా ప్రముఖ బిల్డర్లు, ప్రముఖ వాహన డీలర్లు, ఇతర వాణిజ్య సంస్థలవారు తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తారని, నగర ప్రజలందరూ ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అదేవిధంగా బ్యాంకు నిబంధనలకు లోబడి తక్షణ రుణ అవసరాల కోసం బ్యాంకు అధికారులను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

డ్రెయినేజీల్లోని చెత్త తొలగింపు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన



డ్రెయినేజీలోని వ్యర్థాలను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి 25వ వార్డు శాంతిపురం డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తను గురువారం జివిఎంసి పారిశుధ్య సిబ్బంది తొలగించారు. ఈ గెడ్డలో 20రోజులుగా చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన, దోమల బెడదతో తాము పడుతున్న ఇబ్బందులపై ఈ నెల 27న ప్రజాశక్తిలో 'డ్రెయినేజీలతో పరేషాన్' శీర్షికతో వెలుగులోకి తేగా, కొంచం ఆలస్యంగానైనా జివిఎంసి బీ పారిశుధ్య కార్మికులు స్పందించారు. గెడ్డలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. అయితే శాంతిపురం గెడ్డలో పదేపదే చెత్త పేరుకుపోవడానికి గెడ్డలో మూడు పైపులైన్లు ఉండడమే కారణమని, వాటిని అడ్డుకుని ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర చెత్త నిలిచిపోతుండడంతో పదేపదే పారిశుధ్య సమస్య తలెత్తుతోందని స్థానికులు అంటున్నారు. డ్రెయినేజీలో ఉన్న పైపులైన్లను మార్పుచేస్తే ఈ సమస్యకు కొంతవరకు ఉపశమనం లభిస్తుందని స్థానికులు అంటున్నారు.

మండుటెండలకు ఉపాధి కూలీలు విలవిల

▸▸ పని ప్రదేశంలో సౌకర్యాల లేమితో మరిన్ని కష్టాలు


పాడుగుపాలెంలో మండుటెండల్లో పనిచేస్తున్న ఉపాధి కూలీలు

ప్రజాశక్తి -ఆనందపురం :మండుటెండలకు ఉపాధి పనులకు వెళ్తున్న కూలీలు విలవిల్లాడిపోతున్నారు. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో బెంబేలెత్తిపోతున్నారు. ఈ ఏడాది వేసవిలో ఎండలు మండిపోతుండగా, రోహిణికార్తె ప్రవేశించిన తర్వాత మరింత తీవ్రమయ్యాయి. దీంతో ఉదయం ఎనిమిది గంటల తర్వాత పనిచేయలేని దుస్థితి నెలకొంటోంది. పని ప్రదేశంలో గతంలో మాదిరిగా నీడకు టార్పాలిన్లతో టెంట్లుగానీ, తాగునీరు, ఫస్ట్ఎయిడ్ కిట్స్ వంటి సదుపాయాలు లేకపోవడంతో, సమీపంలోని చెట్ల నీడకు పరుగులుతీసి సేదదీరుతున్నారు. ఉపాధి కరువై పనులకు వస్తున్న కూలీలన్నా, వారి ప్రాణాలన్నా ప్రభుత్వాలు, పాలకులు, అధికారులకు చిన్నచూపు అనడానికి ఉపాధి పనిప్రదేశంలో నానాటికీ లేకుండా చేస్తున్న సౌకర్యాలే నిదర్శనమని కూలీలు మండిపడుతున్నారు. కొన్ని చోట్ల పనిప్రదేశాల్లో చెట్ల నీడ కూడా లేకుండా ఉందని, అలాంటి చోట పనులు చేస్తున్న కూలీలు ఎండ, ఉక్కపోతతో వడదెబ్బకు గురైతే వారి ప్రాణాలకు ఎవరు బాధ్యులని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పని ప్రదేశంలో సౌకర్యాల కల్పనకు ప్రభుత్వపరంగా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

రారెత్తిస్తున్న ఎండలు

అధిక ఉష్ణోగ్రతలతో జనం విలవిల

నిర్మానుష్యంగా రోడ్లు, వీధులు

నిలిచిపోయిన ఇటుక తయారీ


నిర్మానుష్యంగా మద్ది జంక్షన్

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలో నాలుగు రోజులుగా ఠారెత్తిస్తున్న ఎండలతో జనం విలవిల్లాడిపోతున్నారు. దాదాపు 43డిగ్రీల సెంటీగ్రేడు ఉష్ణోగ్రతలు నమోదు కావడం, పొద్దుపొడుస్తూనే భానుడు భగభగలాడుతుండడంతో ఉదయం 9గంటలు దాటేసరికి బయటకు వెళ్లాలంటే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.నాలుగైదు గంటల వరకు ఎండల తీవ్రత కొనసాగుతుండడంతో దాదాపు పగటి పూటంతా రోడ్లు, వీధులన్నీ నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. నిత్యం ఏ సమయంలోనైనా రద్దీగా ఉండే పద్మనాభం, మద్ది, రేవిడి జంక్షన్‌లు జనాలు లేక వెలవెల బోతున్నాయి. పగటిపూట రోడ్డుపైకి రావాలంటే ప్రజలు హడలిపోతున్నారు. గ్రామాల్లో పాన్, కిరాణా షాపులు, హోటళ్ల వ్యాపారాలు గణనీయంగా తగ్గిపోయాయి. అధిక ఉష్ణోగ్రత ప్రభావం మండలంలోని ఇటుకల తయారీ పరిశ్రమపై స్పష్టంగా కనిపిస్తోంది. ఇటుక తయారీ కేంద్రాల్లో కార్మికులు పనిచేయడం లేదు. పశువుల కాపర్లు ఉదయం ఏడు నుంచి 9 గంటల లోపే పశువులను మేతకు తీసుకెళ్లి తర్వాత తిరిగి పశువుల శాలలకు గానీ, లేకుంటే ఏదైనా చెట్టు నీడకు చేరిపోతున్నారు. మొత్తానికి రోహిణి కార్తె ప్రభావం స్పష్టంగా కనిపిస్తోందని ప్రజలు అంటున్నారు.

పచ్చిరొట్ట విత్తనాలపై అవగాహన కల్పించండి

ప్రజాశక్తి -పద్మనాభం : రైతులకు పచ్చిరొట్ట విత్తనాల సాగుతో కలిగే ప్రయోజనాలను వివరించి, వ్యవసాయ బోర్లున్న చోట విధిగా వేసేలా అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె. అప్పలస్వామి సూచించారు. గురువారం మండలంలోని కోరాడ, రెడ్డిపల్లి, పొట్నూరు, కృష్ణాపురం, తుని వలస రైతుభరోసా కేంద్రాలను సందర్శించారు. పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా, అమ్మకాలపై వ్యవసాయ అసిస్టెంట్లను ప్రశ్నించి, కొన్ని సూచనలు చేశారు ముందుస్తు ఖరీఫ్‌లో పొలాల్లో వేసిన పచ్చిరొట్ట పైర్లను భూమిలో కలియ దున్నితే భూమి సారవంతం కావడంతోపాటు, యూరియా వినియోగం తగ్గుతుందని, తర్వాత ఖరీఫ్ ప్రధానపంట ఆరోగ్యవంతమైన మంచి దిగుబడి ఇస్తుందని రైతులకు వివరించాలని సూచించారు. వ్యవసాయశాఖ అధికారులు సిహెచ్ చలం, రావు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు రగ్బీ క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి -భీమునిపట్నం : రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు సంబంధించి క్రీడాకారుల ఎంపిక స్థానిక వుడా మినీ స్టేడియంలో గురువారం జరిగింది.18 ఏళ్ల లోపు బాలబాలికలను చెరో 12మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు రగ్బీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు లలిత్‌కుమార్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులతా 31,1 తేదీల్లో నాలుగోవార్డు తిమ్మాపురం విజ్ఞాన్ వరల్డ్ స్కూల్‌లో రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్ కుమార్, కోశాధికారి పద్మజ, విజయలక్ష్మి, ఎన్.శ్రీనివాస్ తెలిపారు.

2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-ఉక్కునగరం: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకలను ఉక్కునగరంలో జూన్ 2న ఆదివారం సాయంత్రం నిర్వహిస్తున్నట్టు తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్. కుమారస్వామి, జి. ఆనంద్ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా నిర్వహించే వేడుకల్లో స్టీల్‌ప్లాంట్‌లోని తెలంగాణ ప్రాంత ఉద్యోగులంతా కుటుంబాలతో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మహిళల్లో నైపుణ్యాభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి -పిఎం పాలెం: .మహిళలు విభిన్న రంగాల్లో రాణించేలా వారికి ఉచిత శిక్షణనివ్వడమే లక్ష్యంగా పిఎం పాలెంలో మిత్తిపాటి పవనపుత్ర ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ సొసైటీని స్థాపించినట్లు అధ్యక్షులు లయన్ ఎం లక్ష్మి తెలిపారు..జివిఎంసి 5వ వార్డు మారికవలస వైట్ బిల్డింగ్స్ ప్రాంగణంలో ఉచిత శిక్షణ, సహకార సంఘాన్ని ఏర్పాటు చేశామన్నారు. త్వరలోనే పూర్తి విధివిధానాలు రూపొందించి, మహిళలకు ఉపయోగపడే పలు కోర్సులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి డి. పవన్, కోశాధికారి ఎం.హరిత పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెన్త్ సైన్స్ పరీక్ష

ప్రజాశక్తి - ఆరిలోవ : పదోతరగతి సప్లమెంటరీ సైన్స్(ఎన్ఎస్) పరీక్ష గురువారం ప్రశాంతంగా జరిగినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. జిల్లాలోని 20 పరీక్షా కేంద్రాల్లో 3,491 విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 2,487 మంది విద్యార్థులు హాజరయ్యారు. 1004 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. డిఇఒఎల్.చంద్రకళ రెండు కేంద్రాలను, స్క్వాడ్ బృందాలు 12 కేంద్రాలను సందర్శించి, ఆకస్మికంగా తనిఖీ చేశారు.

శాంతియుత వాతావరణానికి సహకరించండి


మాట్లాడుతున్న ఒకటో జోన్ డిసిపి లక్ష్మీనారాయణస్వామి

ప్రజాశక్తి-పద్మనాభం :ఎన్నికల పలితాలు విడుదల తర్వాత కూడా గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి ప్రజలంతా సహకరించాలని ఒకటో జోన్ డిసిపి లక్ష్మీనారాయణస్వామి సూచించారు. బుధవారం రాత్రి అన్ని పార్టీల రాజకీయ నేతలు, యువతతో మండల కాంప్లెక్స్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతిఒక్కరూ నిబంధనలను పాటించాల్సిందేనని, అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈనెల 13న ఎన్నికల సమయంలో మండలంలో ఎలాంటి ప్రశాంత వాతావరణం కనిపించిందో ఒకటిన ఎగ్జిట్ పోల్స్ రోజున, 4న ఫలితాల వెల్లడి తర్వాత ఉండాలని సూచించారు. ఫలితాల వెల్లడి తర్వాత విజయోత్సవ ర్యాలీలు, సదస్సులు, బాణసంచా కాల్చడం, ప్రత్యర్థులను కవ్వించడం వంటి చర్యలపై నిషిద్ధమన్నారు.ప్రజలంతా సహకరించాలని కోరారు

582 మందిపై బైండోవర్ కేసులు

కౌంటింగ్ తర్వాత ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా మండలంలో రెండు ప్రధాన పార్టీలకు చెందిన నేతలు 582మందిని బైండోవర్ చేశామన్నారు. ఎన్నికల్లో భీమిలిలో పది మందిని జైల్‌కు పంపించామన్నారు. తగరపువలస, ఆనందపురం, భీమిలిలో గొడవలకు పాల్పడిన 40 మందిపై కేసులు నమోదు చేసి, రౌడీషీట్లు తెరిచామన్నారు వీరంతా పోలీస్‌స్టేషన్ పరిధిని దాటి వెళ్లడానికి వీల్లేదన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు .3.4.5 తేదీల్లో మద్యం అమ్మకాలపై నిషేధం ఉందన్నారు.ముందుగా మద్యం తెచ్చుకుని, ఆయా రోజుల్లో గొడవ చేస్తే చర్యలు తప్పవన్నారు. చిన్నాపురం జంక్షన్‌లో చెక్‌పోస్టు కొనసాగుతుందన్నారు.ఎసిపి సునీల్, సిఐ సిహెచ్.శ్రీధర్.ఎస్ఐ సురేష్, నేతలు కె రాంబాబు, కె లక్షణరావు, కె దామోదరరావు, ఎం నందేశ్వరరావు, కె నగేష్‌కుమార్, మహేష్, ఆర్ఎఎన్ మూర్తి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

అపార్ట్‌మెంట్ పై నుంచి పడి కారు డ్రైవర్ దుర్మరణం

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు బాలాజీ నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్ పైనుంచి ప్రమాదవశాత్తు కిందకు పడడంతో తీవ్రగాయాలతో కారుడ్రైవర్ అక్కడికక్కడే దుర్మరణం పాలైన ఘటన బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..

కారు డ్రైవర్ నీలాపు శ్రీను (37), భార్య పిల్లలతో భీమిలి మండలం చిప్పాడ గ్రామదేవత పండగకు బుధవారం వెళ్ళారు. అక్కడ నుంచి భార్య, ఇద్దరు పిల్లలను చిప్పాడలో బంధువుల ఇంటి వద్దనే ఉంచి,బాలాజీనగర్‌లో ఉన్న ఇంటికి శ్రీను వచ్చారు. రాత్రి 12.30 గంటల సమయంలో చల్లని గాలి కోసం బాల్కనీ వద్ద పిట్ట గోడపై పడుకోగా, ప్రమాదవశాత్తు కింద జారిపడడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. అతని బంధువులు 108కి సమాచారం అందించగా, 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరీక్ష చేయగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీనిపై ఎస్ఐ జి.హరీష్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొలం గట్టు పై నుంచి పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గొలుగొండ : హైవే రోడ్డు పనుల్లో కూలి పనికి వచ్చిన తెలంగాణ రాష్ట్రం నారాయణపేట జిల్లా పాత రచేడు గ్రామానికి చెందిన జోగు అంజనేయులు(37) గొలుగొండ మండలం పల్లావూరు శివారు పొలం గట్టుపై నడుస్తుండగా కాలు జారి పడి మృతి చెందినట్లు కేడీపేట ఎస్ఐ ఉపేంద్ర తెలిపారు. మృతుని బంధువు తెలుగు అనంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గురువారం కుటుంబసభ్యులు వచ్చిన తర్వాత మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, వారికి అప్పగించారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి -పిఎం.పాలెం : ఎపిఇపిడిసిఎల్ మూడవ జోన్ పరిధిలో ఆపరేషన్ ఇఇ పోలాకి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పిఎం పాలెం, ధర్మపురి, సప్తగిరి ఫీడర్ల నిర్వహణ, మరమ్మతు పనుల దృష్ట్యా ఈనెల 31న శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటలకు విద్యుత్ సరఫరా నిలిపేయనున్నట్లు పిఎం పాలెం ఎఇఇ మండల అప్పలనాయుడు తెలిపారు. ఆయా ఫీడర్ల పరిధిలోని.ధర్మపురి కాలనీ, ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వెనుక భాగం, తారకరామ నగర్, బింద్రానగర్, పీర్లేస్ కాలనీ, డామినోస్ పిజ్జా ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అలరించిన కృష్ణ సినీసంగీత విభావరి

ప్రజాశక్తి- సీతమ్మధార: సూపర్ స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా పల్లవి మ్యూజిక్ సినీ సాంస్కృతిక సంగీత సంస్థ గురువారం సాయంత్రం పౌర గ్రంథాలయంలో నిర్వహించిన కృష్ణ సినీ సంగీత విభావరి శ్రోతల్ని ఎంతగానో ఆకట్టుకుంది. బి.ఫణిభూషణ్ పాడిన తెలుగు వీర లేవరా, పల్లా బాబ్జి, పావని పాడిన దోరవయసు చిన్నది, ఆంజనేయ రెడ్డి, అంబికా పాడిన ఈ గాలిలో ఎక్కడో అలకిడి, వెంకటేష్ మాస్టారు, స్వరూప పాడిన ఎక్కడో చూసిన జ్ఞాపకం, వీరేంద్ర, భాగ్యలక్ష్మి పాడిన నమస్తే సుస్వాగతం తదితరుల ఉషారైన గీతాలు ఆలపించి ప్రేక్షకులను అలరించారు. ఘంటసాల క్రీడా సాంస్కృతిక సంఘం కార్యదర్శి చెన్నా తిరుమలరావు, సోషల్ మీడియా రాష్ట్ర అధ్యక్షులు సన్ మూర్తి జ్యోతి ప్రజ్వళనతో నిర్వహించిన సినీసంగీత విభావరిలో కీబోర్డుతో సోమేశ్, తబలా ఎవి.చలం, ఫాడ్స్ బాబ్జి, గిటార్ రమణ మూర్తి సహకారాన్ని అందించగా, లక్ష్మి స్వరూప వ్యాఖ్యానం చేశారు.

దివీస్ ఛాలెంజర్స్ ట్రోఫీ ప్రారంభం

ప్రజాశక్తి -భీమునిపట్నం :మండలంలోని పాత మూలకుద్దులో దివీస్ ఛాలెంజర్స్ ట్రోఫీ పోటీలను గురువారం సంస్థ జనరల్ మేనేజర్ వైఎస్ కోటేశ్వరరావు ప్రారంభించారు. 12 పంచాయతీలకు నుంచి 32 జట్లు పాల్గొనగా విజేతలకు రూ.50వేలు, రన్నరప్‌కు రూ.25వేలు నగదు బహుమతి ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నెలరోజుల పాటు దివీస్ సామాజిక బాధ్యతలో భాగంగా నిర్వహించే పోటీల్లో క్రీడాకారులకు జెర్సీ, క్యాప్, కిట్లును జిఎం కోటేశ్వరరావు అందజేసారు.కార్యక్రమంలో సంస్థ డిజిఎం ప్రభాకర్, సిఎస్ఆర్ మేనేజర్ సురేష్‌కుమార్, సిబ్బంది శ్రీనివాస్, శేఖర్‌బాబు, పైడినాయుడు, నరసింహ పాల్గొన్నారు

నేడు వెంకటరావు ఉద్యోగ విరమణ

స్టీల్‌ప్లాంట్‌లో డిప్యూటీ మేనేజర్‌గా బాధ్యతల నిర్వహణ



స్టీల్‌ప్లాంట్ డిప్యూటీ మేనేజర్ డి.వెంకటరావు దంపతులు

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ స్టీల్ ప్లాంట్‌లో డిప్యూటీ మేనేజర్‌గా విధులు నిర్వహించిన దొడ్డి వెంకటరావు ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు. 1964, మే 2న జన్మించిన దొడ్డి వెంకటరావు ఐదో తరగతి వరకు నెల్లిముక్కు ప్రాథమిక పాఠశాలలోనూ, ఏడవ తరగతి వరకు నడుపూరులోనూ, 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు పరవాడ హైస్కూల్లోనూ చదివారు. 1985లో కంచరపాలెం ఓల్డ్ ఐటిఐలో డీజిల్ మెకానిక్ ఐటిఐ కోర్స్ పూర్తి చేశారు. 1987 మార్చిలో జూనియర్ ట్రైనీగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగం సంపాదించారు. 1989 మార్చి నెలలో టెక్నీషియన్ గాను, తర్వాత జనరల్ ఫోర్‌మెన్ గాను, జూనియర్ ఆఫీసర్‌గాను, ప్రస్తుతం డిప్యూటీ మేనేజర్‌గా వివిధ హోదాల్లో అంచెలంచెలుగా ఉద్యోగోన్నతి పొందారు. 1983లో సిఐటియులో చేరిన వెంకటరావు, అప్పట్లో స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగాను, నిర్వాసితుల సమస్యలపైనా పోరాటాల్లో పాల్గొన్నారు. స్టీల్ ప్లాంట్ బిఐఎఫ్‌ఆర్ వెళ్లిన సమయంలోనూ జరిగే అన్ని పోరాటాల్లో పాల్గొన్నారు. భవిష్యత్తులోనూ కార్మిక సమస్యలపైనా, స్థానిక ప్రజల సమస్యలపైనా పనిచేస్తానని వెంకటరావు అంటున్నారు. ఉద్యోగ విరమణ చేస్తున్న దొడ్డి వెంకటరావుకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

కిషోర్‌కు శ్రీధర్ పరామర్శ



కిషోర్‌ను పరామర్శిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

ప్రజాశక్తి - వేపగుంట : ప్రమాదంలో గాయపడి, చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న చదువుకున్న రోజుల్లో చిన్ననాటి మిత్రుడు, ప్రజాశక్తి విలేకరి కిశోర్‌ను జివిఎంసి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ గురువారం పరామర్శించారు. కిశోర్ ఇంటికి స్వయంగా వెళ్లిన శ్రీధర్, తన మిత్రుడి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నాడు. త్వరలో కోలుకుని, సంపూర్ణ ఆరోగ్యం సిద్ధించాలని ఆకాంక్షించారు. పరామర్శకు వచ్చిన బాల్యస్నేహితుడు శ్రీధర్‌కు కిశోర్ సాదరంగా స్వాగతించాడు.

జగన్‌పై ఆరోపణలు తగవు!

ప్రజాశక్తి -మధురవాడ : పార్టీ మారినంత మాత్రాన అధినేత జగన్‌ను పట్టుకుని లేనిపోని ఆరోపణలు చేయడం వంశీకృష్ణ శ్రీనివాస్‌కు తగదని వైసిపి జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు ఆక్షేపించారు. గురువారం ఎండాడలోని వైసిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వంశీకృష్ణకు అనేక పదవులిచ్చి సిఎం జగన్ గౌరవించారన్నారు. వైసిపి ఏం అన్యాయం చేసిందో చెప్పాలని వంశీకృష్ణను ప్రశ్నించారు. తూర్పు ఎమ్మెల్యేగా పోటీకి అవకాశమిస్తే ఏం జరిగిందో అందరికీ తెలుసునని, ఇపుడు దక్షిణంలోనూ గెలుస్తానన్న పగటి కలలు మానుకోవాలన్నారు. వైసిపి నుంచి పోటీచేసిన అభ్యర్థులంతా విజయం సాధించడం ఖాయమని, వచ్చేనెల 9న విశాఖలోనే ముఖ్యమంత్రిగా మళ్లీ జగన్ ప్రమాణస్వీకారం చేస్తారన్నారు వంశీ ఎక్కడి నుంచి వెళ్లాడో గుర్తెరిగి మాట్లాడాలని హితవు పలికారు. కార్యక్రమంలో వి.మారుతీ ప్రసాద్, అప్పన్న, శివరామకృష్ణ ఉన్నారు.

ఘనంగా సిఐటియు ఆవిర్భావ దినోత్సవం

● పలుచోట్ల కార్మిక జెండా ఆవిష్కరణలు ● గౌరవ వందనాన్ని సమర్పించిన శ్రామికులు

సిఐటియు 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని కార్మికులు, కార్మిక సంఘాల నేతలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. అనేక చోట్ల యూనియన్ జెండాను ఆవిష్కరించారు. సిఐటియు ఆవిర్భావాన్ని స్మరణకు తెచ్చుకుని, కార్మికుల హక్కుల రక్షణ, పరిశ్రమల పరిరక్షణకు ఐక్యపోరాటాలతో ముందుకు సాగాలని నిర్ణయించారు. కొన్నిచోట్ల మజ్జిగ చలివేంద్రాలను ఏర్పాటు చేశారు.

(ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం)



ఆవిర్భావ దినోత్సవంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జగ్గునాయుడు

విశాఖ కలెక్టరేట్ : సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జగదాంబ దరి సిఐటియు జిల్లా కార్యాలయం వద్ద సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కెఎం.కుమార్‌మంగళం పతాకావిష్కరణ చేశారు. అనంతరం సిఐటియు 54వ వ్యవస్థాపక దినోత్సవాన్ని తెలియజేస్తూ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ కార్మిక సమస్యల పరిష్కారానికి 1970 మే 30న సిఐటియు కొల్‌కతాలో ఏర్పడిందన్నారు. అన్ని కార్మిక సంఘాలను ఐక్యం చేసి, ఒక తాటిపైకి తీసుకువచ్చి ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై మిలిటెంట్ పోరాటాలను నిర్వహించిందన్నారు. మరలా మోడీ అధికారంలోకి వస్తే ఉన్న కార్మిక హక్కులను కూడా లేకుండా చేస్తారన్నారు. కార్మికవర్గ రాజ్య స్థాపనకు కార్మికవర్గం సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా వర్కింగ్ ఉమెన్ కన్వీనర్ పి.మణి, సిఐటియు జిల్లా కార్యదర్శులు బి.జగన్, ఎం.సుబ్బారావు, జివిఎంసి ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు టి.నూకరాజు, యు.రాజు, ముఠా యూనియన్ నాయకులు వై.రాజు, పైడిరాజు, బంగారయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కె.నరసింగరావు, కెవిపి చంద్రమౌళి, ఎం.సూరీడు, పోలేశ్వరరావు పాల్గొన్నారు.

ఆరిలోవ : దోపిడీ లేని కార్మిక వర్గ రాజ్యం ఏర్పాటు లక్ష్యంగా, కార్మిక హక్కుల పరిరక్షణకు సిఐటియు నిరంతరం పోరాడుతుందని విశాఖ జిల్లా ప్రధానకార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్ అన్నారు. మంగళవారం సిఐటియు 54వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా విమ్స్ ఆసుపత్రి వద్ద యూనియన్ జెండాను కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు పి వెంకటరావు విమ్స్ యూనియన్ నాయకులు రాజేశ్వరి, పార్వతి, కనకరాజు, సింధు, అన్నపూర్ణ, ఈశ్వరరావు పాల్గొన్నారు.

సమరశీల పోరాటాల సారథి సిఐటియు :జగ్గునాయుడు

ములగాడ : సమరశీల పోరాటాల సారథి సిఐటియు అని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అన్నారు. యూనియన్ 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో హెచ్‌పిసిఎల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, విశాఖ జిల్లాలో 50వేల మంది సభ్యత్వంతో అతి పెద్ద కార్మిక సంఘంగా ఉన్న సిఐటియు, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు మూడేళ్లకుపైగా నిరంతరంగా పోరాటం చేస్తోందన్నారు. 44కార్మిక చట్టాలను లేబర్‌కోడ్స్‌గా మార్చడం, కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అమలు, ఇఎస్‌ఐ, పిఎఫ్ వంటి సౌకర్యాలను చట్టపరంగా కల్పించాలని డిమాండ్ చేస్తూ కార్మికులను సంఘటిత పరిచి పోరాటాలు చేస్తోంద న్నారు. కార్యక్రమంలో మల్కాపురం జోన్ అధ్యక్షులు కె. పెంటారావు, ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మణమూర్తి, హెచ్‌పిసిఎల్ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎం కృష్ణారావు జి. నరేష్, ఎస్.వాసు, ఏసుబాబు కిరణ్, గంగాధర్, రాము, మురళీ, ప్రేమ్ ప్రసాద్, రాజు, హరి, బి.శ్రీను, రాజేష్, దాసు పాల్గొన్నారు.

హెచ్‌పిసిఎల్ లేబర్ గేట్, కల్యాణి గేట్, షిప్‌యార్డు, సింధియా జంక్షన్, కోరమండల్ మల్కాపురం ఆఫీస్ వద్ద భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలోనూ, 59వ వార్డు నెహ్రూ నగర జంక్షన్, ములగాడ హౌసింగ్ కాలనీ, 62వ వార్డు దుర్గా నగర్, త్రినాధపురం, ఎఎస్‌ఆర్ కాలనీ, ఎన్‌టిఆర్ కాలనీ, 63 వార్డు కాకరలోవ, చింతలలోవ, క్రాంతి నగర్, జీవీఎంసీ మున్సిపల్ కార్మికుల ఆధ్వర్యంలో 58 ,59 ,60 , 62 వార్డులో విడిఆర్‌ఐపియల్, శరత్‌చటర్జీ గోడౌన్స్, మినీ మోటార్ ట్రాన్స్‌పోర్టు ముఠా కార్మిక సంఘం వద్ద సిఐటియు ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. ఆర్ లక్ష్మణమూర్తి కె.రమణ, పి సంజీవి, ఎం.కృష్ణారావు, జి.దుర్గాప్రసాద్ వి.అప్పలనాయుడు, నాగేశ్వరరావు, దేముడు, సన్యాసిరావు కె.రమణ, రాంబాబు, సూరిబాబు, ఆర్.అప్పారావు, యల్.కృష్ణ, కర్రెయ్య, బి.జగ్గునాయుడు పిసిని రామారావు, అర్జునరావు యూనియన్ పతకాలను ఆవిష్కరించారు. సిఐటియు జోన్ అధ్యక్షులు కె.పెంటారావు పి.పైడిరాజు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమమే సిఐటియు లక్ష్యం

అనకాపల్లి : దేశంలో కార్మిక సంక్షేమం కోసం 54ఏళ్లుగా సిఐటియు పనిచేస్తుందని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయం వద్ద సంఘం మండల నాయకులు మందా రాము, బేవరేజెస్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద యూనియన్ ప్రెసిడెంట్ రమణ, భీశెట్టి అప్పారావు, నందీశ్వరరావు, ముఠా కార్మికులు, ఆచార్య ఎన్‌జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కార్మికులు సిఐటియు జెండా ఆవిష్కరణలు చేశారు.కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకర్రావు, నాయకులు పిఎన్‌వి .పరమేశ్వరరావు, గంటా శ్రీరామ్, బోడి రాజు, ఆర్టీసీ హైర్ బస్సు యూనియన్ నాయకులు వెంకట అప్పారావు, పలక సత్యనారాయణ, ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు అప్పారావు పాల్గొన్నారు.

గాజువాక : భెల్‌లో సిఐటియు 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్మిక జెండాను సీనియర్ కార్మికుడు కె.కేశ్య ఆవిష్కరించారు. సిఐటియు ప్రధాన కార్యదర్శి జిటిపి ప్రకాష్, నాయకులు ఎస్ జగన్నాథరావు, వి బాబూరావు, పివిఎన్ రాజు, కే దేవుడు, వారాడ ఆనంద రావు, ఆర్‌ఆర్ నాయుడు, వై కృష్ణారావు పాల్గొన్నారు .

వడ్లపూడి రైల్వేవేగన్ వర్క్‌షాప్ గేటు వద్ద సిఐటియు జెండాను ఈస్ట్‌కోస్ట్ రైల్వే స్టేట్ సెక్రటరీ వివిఎల్ నరసింహులు ఆవిష్కరించారు. సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎం.రాంబాబు, రైల్వే వేగన్ వర్క్‌షాప్ ప్రెసిడెంట్ అవతారం, సెక్రెటరీ ఎస్.రాజు, సురేష్, సతీష్ పాల్గొన్నారు.



రైల్వే వేగన్ వర్క్‌షాప్ వద్ద కార్మిక పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నరసింహులు

మధురవాడ : మధురవాడ లా కాలేజీ ఆటోస్టాండ్ వద్ద సిఐటియు పతాకాన్ని సంఘం అధ్యక్షుడు సూరిబాబు ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ నేత పి. రాజుకుమార్, చిన్న, రాము, అంజి, ఎర్రయ పాల్గొన్నారు.

సీతమ్మధార : తాటిచెట్లపాలెం యూనియన్ కార్యాలయం వద్ద సిఐటియు అక్కయ్యపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యంలో సిఐటియు పతాకాన్ని ఆవిష్కరించారు. జోన్ కమిటీ అధ్యక్షుడు కెఎస్ కుమార్, కార్యదర్శి ప్రకాశరావు. ఎన్, బాబ్జి, ప్రభాకరరావు, సిపిఎం జిల్లా నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.



స్టీల్‌ప్లాంట్‌లో అరుణ పతాకానికి సిఐటియు నేతల గౌరవ వందనం

ఉక్కునగరం: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలను మరింత ఉధృతం చేయాలని స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు రామస్వామి పిలుపునిచ్చారు. స్టీల్ సిఐటియు ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ప్రధాన పరిపాలన భవనం ఎదుట యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూఉద్యమాలకు కేంద్ర బిందువుగా నిలచిన సిఐటియు, 1991లో నూతన ఆర్థిక పారిశ్రామిక విధానాలకు వ్యతిరేకంగాచేపట్టిన సమ్మెలో ప్రధాన భూమిక పోషించిందన్నారు విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఐక్య ఉద్యమాలను నిర్వహిస్తూ విశాఖ ఉక్కు ఉద్యమాన్ని ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ ఉద్యమంగా దేశవ్యాప్త ఉద్యమంగా మలచడానికి కృషి చేస్తోందన్నారు. స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటిదాస్ మాట్లాడుతూ మతోన్మాద రాజకీయాలతో కార్మిక హక్కులకు రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వెలిబుచ్చారు.స్టీల్ సిఐటియు నాయకులు బి అప్పారావు, పి శ్రీనివాసరాజు, కష్ణమూర్తి, నీలకంఠం, బి ఎన్ మధుసూదన్, మొహిద్దిన్, లోకేష్, దుర్గాప్రసాద్, విడివి పూర్ణచంద్రరావు, వివి రమణ, బి సత్యనారాయణ, రాజు, వేణు, సూర్యనారాయణ, వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

పెందుర్తి : పెందుర్తి జోన్ కార్యాలయం వద్ద సిఐటియు పతాకాన్ని శంకరరావు ఆవిష్కరించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి బి.జగన్ మాట్లాడుతూ, కార్మికుల హక్కుల పరిరక్షణకు ఐక్యత పోరాటం నినాదంతో, సిఐటియు నిజాయితీతో పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో సిపిఎం జోన్ కార్యదర్శి బి. రమణి, సిఐటియు నాయకులు ఎస్ శంకరరావు, నాయకులు పద్మ, అప్పలనాయుడు మాట్లాడారు కార్మికులు ఈశ్వరరావు, ప్రభు దాస్, మహేష్, లక్ష్మి పాల్గొన్నారు.

అచ్యుతాపురం : సిఐటియు మండల కార్యదర్శి కె.సోమునాయుడు కార్మికజెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము మాట్లాడుతూ ఎస్‌సిజెడ్, ఫార్మా, బ్రాండిక్స్ వంటి పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలపై సిఐటియు నిరంతరం పోరాడుతుందని చెప్పారు. మణెమ్మ, శ్రీరాములు, పంచాయతీ, కార్మికులు ఎస్‌ఇజెడ్, ఆటో, ముఠా కార్మికులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం కృష్ణాబజారు సెంటర్‌లో ముఠా కార్మిక సంఘం ఆధ్వర్యంలో సిఐటియు పతాకాన్ని కన్వీనర్ టి.ఈశ్వరరావు ఆవిష్కరించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ, కార్మిక సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల సాధనకు నిరంతరం సిఐటియు పోరాటం కొనసాగిస్తుందన్నారు. ముఠా కార్మిక సంఘం నాయకులు ఎం రమణ, నానాజీ పాల్గొన్నారు.



నర్సీపట్నంలో కార్మిక పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సిఐటియు నేతలు

పారదర్శకంగా కౌంటింగ్ నిర్వహణ

జిల్లా కలెక్టరు రవి పట్టన్ శెట్టి



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

ప్రజాశక్తి- అనకాపల్లి

పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టరు రవిపట్టన్ శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరు కార్యాలయంలో గురువారం కౌంటింగ్ ప్రక్రియపై నిర్వహిస్తున్న శిక్షణా తరగతులలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ నిర్వహణపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. జూన్ 4వ తేదీ ఉదయం 8గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమౌతుందని, ముందుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు చేస్తారని చెప్పారు. స్ట్రాంగ్ రూములను పోటీ అభ్యర్థుల, ఏజెంట్ల సమక్షంలో తెరవాలని సష్టం చేశారు. పోస్టల్ బ్యాలట్‌కు ఒక సూపర్ వైజర్, ఇద్దరు కౌంటింగ్ అసిస్టెంట్లు, ఒక మైక్రో అబ్జర్వర్ వుంటారని చెప్పారు. ప్రతి టేబుల్ వద్ద వారికి కేటాయించిన కంట్రోల్ యూనిట్లు చెక్ చేసి కౌంటింగ్ చేయాలన్నారు. కంట్రోల్ యూనిట్ లెక్కింపు ప్రారంభానికి ముందు కంట్రోల్ యూనిట్లో నమోదైన మొత్తం ఓట్లు ఫారం 17సితో నమోదైన ఓట్లు సరి చూసుకోవాలని తేడా వస్తే వెంటనే సదరు కంట్రోల్ యూనిట్‌ను రిటర్నింగ్ అధికారికి అప్పగించాలని ఆదేశించారు. కంట్రోల్ యూనిట్లో నమోదైన మొత్తం ఓట్లు ఫారం 17సీలో నమోదైన ఓట్లను ట్యాలీ చేసుకొని రిజల్ట్ బటన్ ప్రెస్ చేయాలని, కౌంటింగ్ ఏజెంట్లకు ఫలితాలు చూపించి వాటిని నిర్దేశించిన నమూనాలో నమోదు చేయాలని, 14 టేబుల్స్ వద్ద కౌంటింగ్ పూర్తయిన తర్వాత, ఆ రౌండ్ వివరాలు రిటర్నింగ్ అధికారి వెల్లడించిన తర్వాత మాత్రమే తదుపరి రౌండ్ కౌంటింగ్ ప్రారంభించాలని తెలిపారు. అధికారులు కౌంటింగ్ ప్రక్రియలో ఓటు నమోదు వివరాలకు సంబంధించి గోప్యత పాటించాలని ఆదేశించారు. వీవీ ప్యాట్ స్లిప్పుల లెక్కింపు అప్రమత్తంగా చేయాలని, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్లిప్పులను బ్లాక్ కవర్లలో భద్రపర్చి సీల్ చేయాలని, మొత్తం వీడియోగ్రఫీ చేయాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రంలోకి ఎవరికీ సెల్ ఫోన్ అనుమతి లేదని కౌంటింగ్ కేంద్రం వద్ద అవసరమైన తనిఖీ నిర్వహించి మాత్రమే లోనికి అనుమతి జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లైస్ జి.ఎం. కె.జయంతి, డిఎల్.డివో నాగలక్ష్మి, డిఎల్.పి.వో. కుమార్ కౌంటింగ్ సూపర్ వైజర్లు, సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూముల చుట్టుపక్కల 2 కిలోమీటర్ల వరకు రెడ్ జోన్

అనకాపల్లి : అనకాపల్లి కలెక్టరేట్ వద్దగల ఫ్యూచర్ వరల్డ్ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన ఈవీఎం స్ట్రాంగ్ రూమ్స్ చుట్టుపక్కల 2 కిలోమీటర్ల మేర రెడ్ జోన్‌గా ప్రకటించినట్లు జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌ల చుట్టూ ఉన్న గగనతలంలో అనధికార డ్రోన్ కార్యకలాపాలను 2 కిలోమీటర్ల మేర నిషేధించడం జరిగిందన్నారు. ఈ రెడ్ జోన్ నిబంధనలు వెంటనే అమలులోకి వచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీసు అధికారులను ఆదేశించినారు. ఈ రెడ్ జోన్ నిబంధనలు కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంతవరకు అమలులో ఉంటాయన్నారు. ఎవరైనా ఈ నిబంధనలు అతిక్రమించిన ఎడల వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.



రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకుంటున్న స్థానికులు

టిడిఆర్‌లు ఇచ్చాకే రోడ్డు పనులు చేపట్టండి

ప్రజాశక్తి -అనకాపల్లి

తమకు టిడిఆర్‌లు ఇచ్చిన తర్వాతే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని సుంకరిమెట్ట ప్రాంత ప్రజలు గురువారం రోడ్డు పనులను అడ్డగించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... అనకాపల్లి డైట్ కళాశాల జంక్షన్ నుంచి సుంకరిమెట్ట జంక్షన్ వరకు రూ.కోటి 93 లక్షలతో జీవీఎంసీ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించింది. ఇందులో భూ యజమానులు అభ్యంతరం తెలపడంతో 17.5 మీటర్ల పనులు నిలిచిపోయాయి. ఈ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు గురువారం జీవీఎంసీ జోనల్ కమిషనర్ తమ టౌన్ ప్లానింగ్ ఇంజనీరింగ్, రెవెన్యూ విభాగాల సిబ్బందితో రోడ్డు పనులను చేపట్టేందుకు వెళ్లారు. జోనల్ కమిషనర్‌తో పాటు రెవెన్యూ అధికారి, టౌన్ ప్లానింగ్ అధికారులు లేఖ రాసి ఇచ్చేందుకు ప్రయత్నించగా అందుకు తాము అంగీకరించమని స్పష్టం చేశారు. టీడీఆర్లు ఇస్తేనే రోడ్డు వేసేందుకు అనుమతి ఇస్తామని చెప్పడంతో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు భూ యజమానులు, జీవీఎంసీ సిబ్బంది మధ్య తీవ్ర వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. దీనిపై జోనల్ కమిషనర్ అయ్యప్పలనాయుడు మాట్లాడుతూ 17.5 మీటర్ల భూమి ఎవరిది అనేది ఆన్లైన్లో లేకపోవడంతో టీడీఆర్లు ఇవ్వలేకపోయామన్నారు. ఆన్లైన్ అయిన వెంటనే భూ యజమానిని గుర్తించి టీడీఆర్లు ఇస్తామని చెప్పినా భూ యజమానులు రోడ్డు వేసేందుకు అంగీకరించలేదని తెలిపారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా రోడ్డు పనులను అడ్డగించవద్దని జోనల్ కమిషనర్ నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా వారు అంగీకరించలేదు. దీంతో అధికారులు వెనుదిరిగారు. ఈ కార్యక్రమంలో ఏసిపి రామకృష్ణ, టిపిఓ జనార్ధన్, ఆర్వో కుమార్, ఎస్ఇ రామ్మోహన్రావు, డిఈ వేణుగోపాల్, ఏఈ సుమిత్ర, ఆర్ఐలు మర్ర చంద్ర శేఖర్, పరదేశి నాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు డిఎంహెచ్ఒ డాక్టర్ హేమంత్ ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి- అనకాపల్లి



డాక్టర్ హేమంత్

అనకాపల్లి నూతన జిల్లాగా ఏర్పడిన నాటి నుంచి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఎ.హేమంత్ శుక్రవారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన డాక్టర్ హేమంత్ అస్సాం సోల్చర్ మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ పూర్తి చేశారు. శ్రీకాకుళం జిల్లా వజ్రపు కొత్తూరులో మొదట పోస్టింగ్ తీసుకున్న ఆయన 20 ఏళ్ల పని చేశారు. అనంతరం విశాఖ జీవీఎంసీకి సీఎంఓహెచ్‌గా బదిలీ అయ్యారు. తరువాత శ్రీకాకుళం రిమ్స్ లో ఎస్‌సిఆర్‌ఎంఓ గా పనిచేశారు. నూతన జిల్లాగా అనకాపల్లి 2022లో ఏర్పడిన నాటి నుంచి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా పని చేస్తున్నారు. ఉద్యోగ విరమణ సందర్భంగా ప్రజాశక్తితో మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఏర్పాటు, హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్ పూర్తిస్థాయిలో ఏర్పాటుకు కృషి చేసినట్టు తెలిపారు. 2023లో ప్రధానమంత్రి మోడీ చేతుల మీదుగా స్వచ్ఛభారత్ అవార్డు అందుకున్నట్లు చెప్పారు. జిల్లాలో అన్ని శాఖల అధికారుల సమన్వయంతో అన్ని రంగాల్లోనూ వైద్యపరంగా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచినట్టు ఆయన తెలిపారు. కాగా డాక్టర్ హేమంత్ కు కుమారుడు లిఖిత్ సెయింట్ లూయిస్‌లో, కుమార్తె ఆదిశ్రీ డెన్వర్‌లో ఇంజనీర్లుగా పనిచేస్తున్నారు.

నేడు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి -అనకాపల్లి

నిరుద్యోగులకు ఉపాధి శిక్షణ కేంద్రంగా నిలుస్తున్న అనకాపల్లి గౌరీ గ్రంథాలయంలో ఈనెల 31న కెరీర్ గైడెన్స్ -భవిష్యత్తు అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ బి విజయభాస్కర్ హాజరవుతున్నారన్నారు. పాఠశాల, కళాశాల స్థాయిలో విద్య వృత్తిపరంగా ఉండే అవకాశాలు, కెరియర్ పట్ల అవగాహన కల్పించడం జరుగుతుందని చెప్పారు. పదవ తరగతి నుంచి పీజీ వరకు విద్యార్థులకు విద్యా అవకాశాలు, ఉపాధి అవకాశాలు, ఎంట్రన్స్ పరీక్షలు, విద్యార్థుల అభివృద్ధికి తగ్గ కోర్సుల ఎంపిక ఈ సదస్సులో తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో నెల రోజులు పాటు జరిగిన కంప్యూటర్ శిక్షణ తరగతుల్లో పాల్గొన్న వారికి ధ్రువపత్రాల పంపిణీ జరుగుతుందని తెలిపారు.

ఆదర్శనీయుడు అప్పారావు మాస్టారు

నేడు ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి- కె.కోటపాడు



ఈర్లె అప్పారావు

ఎదిగిన కొద్దీ ఒదిగిన వ్యక్తి ఈర్లె అప్పారావు మాస్టారు అని చెప్పక తప్పదు. ఆయన ఉపాధ్యాయునిగా ఏ గ్రామంలో పని చేసినా, ఆ గ్రామంలో ఉన్న నాయకులు, ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులతో మేమేకమై, వారు పాఠశాల వైపు దృష్టి సారించేలా ప్రయత్నం చేసేవారు. ఇతరులను నొప్పించకుండా, తోటి ఉపాధ్యాయుల మనోభావాలను తెలుసుకొని వారితో కలిసిమెలిసి జీవనం సాగించిన వ్యక్తి ఈర్లె అప్పారావు మాస్టారు. ఆయన ఉద్యోగంలో చేరినప్పుడు ఏ విధంగా ప్రవర్తన ఉండేదే అదే విధంగా గెజిటెడ్ స్థాయిలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగోన్నతి పొందినప్పుడు, నేడు ఉద్యోగ విరమణ చేసేవరకు ఆయనలో ఎటువంటి మార్పు కనిపించలేదని ఆయన గురించి తెలిసిన వారు చెబుతూ ఉంటారు.

దేవరాపల్లి మండలం కొత్తపెంట గ్రామంలో ఈర్లె లక్ష్మణ సన్యాసమ్మ దంపతుల మొదటి సంతానంగా 1962లో అప్పారావు మాస్టారు జన్మించారు. ఆయన ప్రాథమిక విద్యాభ్యాసం స్వగ్రామం కొత్తపెంటలోని సమితి ఎలిమెంటరీ స్కూల్లోనూ, 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు కె.కోటపాడు మండలం ఎ.కోడూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలోనూ పూర్తి చేశారు. చోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత పొందిన తరువాత భీమునిపట్నం ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణా కేంద్రంలో టిటిసి పూర్తి చేశారు. ఆ తరువాత ఎయు దూర విద్యాకేంద్రం ద్వారా బిఎ డిగ్రీ, కొత్తవలస క్రిస్ట్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో బిఇడి పూర్తి చేశారు.

1980వ సంవత్సరంలో తోటకూరపాలెం ఎలిమెంటరీ స్కూల్లో ఉపాధ్యాయునిగా అప్పారావు మాస్టారు ఉద్యోగ ప్రస్థానం ప్రారంభమైంది. 1987 వరకు అక్కడి పని చేసిన ఆయన తరువాత కోటవురట్ల మండలం సన్యాసిరాజుపాలెంలో 1989 వరకు పనిచేశారు. 1989లో ఉద్యోగోన్నతి పొంది, కె.కోటపాడు మండలం మల్లంపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టి, 1995 వరకు అక్కడ పని చేశారు. 1995 నుంచి 2001 వరకు ఇదే మండలం గుల్లేపల్లి యుపి స్కూల్‌లో ఎస్‌జిటిగా పనిచేశారు. 2001 నుండి 2011 వరకు రొంగలినాయుడుపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా, 2011 నుంచి 2017 వరకు గరుగుబిల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా విధులు నిర్వర్తించారు. అనంతరం ఉద్యోగోన్నతి పొంది నర్సీపట్నం మండలం పెద్దబొడ్డేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయునిగా 2017 మే నుంచి 2017 జులై వరకు పనిచేశారు. 2017 ఆగస్టు మంచి 2023 జూన్ 7వ తేదీ వరకు రోలుగుంట జెడ్‌పి హైస్కూల్లో హెచ్‌ఎంగా విధులు నిర్వహించారు. అనంతరం 2023 జూన్‌లో కె.కోటపాడు మండలం చౌడువాడ జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయునిగా విధుల్లో చేరిన ఆయన 2024 మే 31వ తేదీన ఉద్యోగ విరమణ చేస్తున్నారు. అప్పారావు మాస్టారు ఎక్కడ పని చేస్తే అక్కడ ప్రజలు, విద్యార్థుల మన్ననలు పొందడం పరిపాటి. 44 సంవత్సరాల సుదీర్ఘ ఉపాధ్యాయ ప్రస్థానంలో ఆయనపై ఎక్కడా ఏ విధమైన ఆరోపణలు లేవు. నిరారంబంగా పనిచేసిన అప్పారావు మాస్టారు నేటితరం ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఆదర్శనీయులు.

నేడు ఆర్టీసీ డిపో మేనేజర్ సుజాత ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి-అనకాపల్లి



నల్లి సుజాత

అనకాపల్లి ఏపీఎస్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న నల్లి సుజాత శుక్రవారం ఉద్యోగ విరమణ చేస్తున్నారు. రాజోలుకు చెందిన సుజాత 1980లో ఏపీఎస్‌ఆర్టీసీ ఆసుపత్రిలో ఫార్మసిస్ట్‌గా 20 సంవత్సరాలు పని చేశారు. 2001లో డిపార్ట్మెంటల్ టెస్ట్ రాసి డిప్యూటీ ట్రాఫిక్కు సూపరింటెండెంట్‌గా రాజోలులో పని చేశారు. రావులపాలెం అసిస్టెంట్ మేనేజర్‌గా, కర్నూల్, విశాఖ స్టీల్ సిటీ, సింహాచలం, మధురవాడ తదితర ప్రాంతాల్లో పనిచేశారు. 2019లో డిపో మేనేజర్‌గా చిలకలూరిపేటలో పని చేసి 2022లో అనకాపల్లికి బదిలీపై వచ్చారు. ఆమె భర్త బాలకృష్ణ విశాఖపట్నం ఆల్ ఇండియా రేడియోలో ఇంజనీరింగ్ సెక్షన్‌లో పని చేశారు. ఆమెకు కుమారుడు పి సుభాష్ హైదరాబాదులో సాఫ్ట్వేర్ ఇంజనీర్‌గా, కుమార్తె పి విరిత అనిల్ నీరుకొండ మెడికల్ కళాశాలలో పాల్మానజి ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు.

2న ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి- మునగపాక : అనకాపల్లి జిల్లా అంతత్వ నివారణ సంస్థ వారి సౌజన్యంతో, స్థానిక శిరిడి సాయిబాబా ధ్యాన మందిరం ఆధ్వర్యంలో జూన్ 2వ తేదీన స్థానిక షిరిడి సాయిబాబా ఆలయ ప్రాంగణంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ బొడ్డేడ వీరేంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు జరిగే ఈ శిబిరానికి శంకర్ ఫౌండేషన్(విశాఖపట్నం) వైద్యులు సేవలు అందించనున్నారని, వైద్య శిబిరానికి వచ్చే వారు ఆరోగ్యశ్రీ కార్డు, ఆధార్ కార్డు ఇతర గుర్తింపు కార్డులు తీసుకురావలసి ఉంటుందని తెలిపారు.



పుస్తకాలను పరిశీలిస్తున్న డిఇఒ వెంకట లక్ష్మమ్మ

సకాలంలో పుస్తకాలు అందేలా చర్యలు

ప్రజాశక్తి-చోడవరం

విద్యార్థులందరికీ సకాలంలో పుస్తకాలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ ఎంఇఒను ఆదేశించారు. చోడవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పియస్.పేటలో ఏర్పాటు చేసిన విద్యా కానుక స్టాక్ పాయింట్‌ను గురువారం డిఇఒ సందర్శించారు. మండలానికి సరఫరా చేయబడిన 1 నుంచి 10 తరగతుల పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను పరిశీలించారు. తరగతుల వారీగా, విషయాలు వారీగా అమర్చిన పాఠ్యపుస్తకాలను పరిశీలించి అనంతరం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, మండల విద్యాశాఖాధికారి కె.సింహాచలం, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు యన్.వి.యస్.యస్.శర్మ పాల్గొన్నారు.



విత్తనాలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి కాంతమ్మ

1350 క్వింటాళ్ల వరి విత్తనాలు సిద్ధం

ప్రజాశక్తి- దేవరాపల్లి

2024 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మండలంలో 1350 క్వింటాళ్ల విత్తనాలు సిద్ధంగా ఉన్నట్లు మండల వ్యవసాయ అధికారిణి ఎల్.వై కాంతమ్మ తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో ఉంచిన విత్తనాలను గురువారం ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 20 రైతు భరోసాకేంద్రాలు ఉండగా, ఇప్పటికే 16 కేంద్రాల్లో 1050 క్వింటాళ్ల విత్తనాలు రైతు భరోసా కేంద్రాలలో ఉన్నాయని చెప్పారు. సోనామసూరి - 42 క్వింటాళ్లు, సాంబామసూరి - 160క్వింటాళ్లు, ఆమర - 113 క్వింటాళ్లు, శ్రీధృతి - 383 క్వింటాళ్లు, మారుటరుసాంబ - 119 క్వింటాళ్లు, స్వర్ణ - 89 క్వింటాళ్లు, శ్రీకాకుళంసన్నాలు - 360 క్వింటాళ్లు, కొత్త రకాలు - 75 క్వింటాళ్లు, ఆర్ఎన్ఆర్ - 4 క్వింటాళ్లు విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉంచడం జరిగిందని తెలిపారు. వచ్చిన విత్తనాల బస్తాలలో 100 గింజలు తీసి అన్ని రైతు భరోసా కేంద్రాలలో మొలక శాతం కట్టడం జరిగిందని కాంతమ్మ తెలిపారు.

రహదారికి ఇరువైపులా తుప్పల తొలగింపు

'ప్రజాశక్తి' వార్తకు స్పందించిన పంచాయతీ కార్యదర్శి అనురాధ

ప్రజాశక్తి - పరవాడ

మండలంలోని రావాడ పంచాయతీ పరిధిలోని బొట్టవానిపాలెం జంక్షన్ నుండి రేకవానిపాలెం వెళ్లే రహదారి గుండా రాకపోకలు ఇబ్బందులపై "రాకపోకలకు పరేషాన్" శీర్షికన ఈ నెల 27న సోమవారం ప్రజాశక్తి ప్రచురించిన కథనానికి రావాడ పంచాయతీ కార్యదర్శి అనురాధ స్పందించారు. ఈ మేరకు గురువారం బొట్టవానిపాలెం జంక్షన్ నుండి రేఖవానిపాలెం గ్రామం వరకు రహదారికి ఇరువైపులా ఉన్న కంచె చెట్లను, తుప్పలను అనురాధ ఆధ్వర్యంలో జెసిబి సహాయంతో తొలగించారు. దీనితో వాహనదారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



జెసిబితో తుప్పలు తొలగిస్తున్న దృశ్యం

విజ్ఞానదాయకంగా వేసవి శిక్షణ శిబిరాలు

మండల కేంద్రాల్లోని శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. శిబిరాల్లో విద్యార్థులకు ఆటపాటలతో పాటు చదువుకు సంబంధించి వివిధ అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు.

(ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం)

యలమంచిలి : స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం 40 మంది విద్యార్థులు పాల్గొనగా వారికి వ్యాస రచన పోటీలు నిర్వహించారు. స్థానిక చార్టడ్ అక్కౌంటెంట్ బండారు బంగారుశెట్టి రైటింగ్ పాడ్స్, పెన్ పేకెట్స్ బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ ఆడారి పూరి జగన్నాథం, హైస్కూలు ఉపాధ్యాయులు అల్లు రత్నరాజు, వై.అప్పారావు, పిడి కె.దుర్గారావు, లైబ్రేరియన్ వి.ఆనంద్ పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరంలో విశ్రాంత గ్రంథాలయాధికారి జి. మురళీకృష్ణ పాల్గొని మాట్లాడారు. గ్రంథాలయాలకు విద్యార్థులు తరచూ రావటం అలవాటు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు కథలు చదివి వినిపించారు. తెలుగు పద్యాలు భావాలు, వ్యతిరేక పదాలు, సామెతలు పిల్లలతో చెప్పించారు. అనంతరం క్విజ్ నిర్యాహించారు. కార్యక్రమం గ్రంథాలయాధికారి కె.జగన్నాథం పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : కథలు జ్ఞాపక శక్తిని పెంచుతాయని శాఖ గ్రంథాలయ అధికారి వి.కృష్ణారావు పేర్కొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న శిక్షణా శిబిరంలో ఆయన మాట్లాడుతూ కథల వలన జ్ఞాపకశక్తి, వినికిడి శక్తి, తెలివి, సామర్థ్యం, భాషా జ్ఞానం విచక్షణ జ్ఞానం వివేకం ఏకాగ్రత పెరుగుతాయని చెప్పారు.

నక్కపల్లి : మండలంలోని చినదొడ్డుగల్లు గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు దేశభక్తి గేయాలు, భక్తి గీతాల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జనార్ధన్ పాల్గొన్నారు.

నక్కపల్లి గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి గోవిందేశ్వరరావు ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు.

చీడికాడ : స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు కథలు, ఆంగ్లంలో పదాలకు స్పెల్లింగ్‌లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి జోగేశ్వరి పాల్గొన్నారు.



రోలుగుంటలలో నీతి కథలు చదువుతున్న విద్యార్థులు

కోటవురట్ల : గ్రంథాలయాన్ని గ్రంథాలయ కార్యదర్శి వెంకట్రావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.జాతీయ నాయకుల జీవిత చరిత్రలతో పాటు విలువలతో కూడిన కథల పుస్తకాలను చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి అప్పలనాయుడు పాల్గొన్నారు.

రోలుగుంట : స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి వరలక్ష్మి ఆధ్వర్యంలో హ్యాండ్ రైటింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం నీతికథలు చదివించారు.

గొలుగొండ : స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయా ధికారి రాజుబాబు ఆధ్వర్యంలో బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్ నిర్వహించారు. స్కిప్పింగ్, కోకో గేమ్ ఆడించారు.

నర్సీపట్నం టౌన్ : గ్రంథాలయంలో రీసోర్స్ పర్సన్ ఎస్.పద్మ ట్రాఫిక్ సిగ్నల్స్‌పై వివరించారు. బలిఘట్టం జెడ్పీహెచ్ఎస్ ఎస్ఎ(సోషల్) సిహెచ్.రాజకుమార్ విద్యార్థులకు చదువుపై శ్రద్ధను వివరించారు. బలిఘట్టం జెడ్పీహెచ్ఎస్ ఆర్ట్ ఎడ్యుకేషన్ పి.శ్రీనివాసరావు విద్యార్థులకు సినరీ డ్రాయింగ్ వేసి చూపించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

పెందుర్తి : స్థానిక శాఖాగ్రంథాలయంలో లైబ్రేరియన్ బి.సూర్యకళ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు కథలు చెప్పడం, చదవడం, పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. యోగ టీచర్ లక్ష్మీ ప్రసన్న విద్యార్థులతో వివిధ ఆసనాలు వేయించడం నేర్పించారు. విశ్రాంత ఉపాధ్యాయులు ఆర్ జానకిరామ్ కథలు చెప్పారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పెతకంశెట్టి భూలోకరావు గ్రంథాలయానికి మైకును బహుకరించారు.అభివృద్ధి కమిటీ సభ్యులు పెంటకోట గణేష్ పెద్ద గోడ గడియారాన్ని బహూకరించారు అభివృద్ధి కమిటీ కార్యదర్శి అడారి రామకృష్ణ నీతి సూక్తులు నేర్పించారు టీచర్ కర్రి సత్యనారాయణ పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు చిత్ర లేఖన పోటీలు, ఇంగ్లీష్ రీడింగ్ నిర్వహించారు. లైబ్రేరియన్ మహేష్ ఆధ్వర్యంలో డైట్ చాత్రోపాధ్యయులు మౌనిక పాల్గొన్నారు

ములగాడ: స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాన్ని సాధించడానికి చిత్తశుద్ధితో కృషిచేస్తే సాకారమౌతుందని వ్యక్తిత్వ వికాస నిపుణులు పల్లా వెంకటమురళి యాదవ్ అన్నారు. మల్కాపురం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. విజయాన్ని సాధించాలంటే తపన, అవకాశాలను సద్వినియోగం చేసుకునే నైపుణ్యం, సమయపాలన, ఇతరులతో చక్కటి స్నేహ సంబంధాలు, సానుకూల దృక్పథం అవసరమన్నారు. ఆయనను లైబ్రేరియన్ వి.అజయ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇపిఎస్. భాగ్యలక్ష్మి, రచయిత కె.సత్తిరాజు సన్మానించారు. అంతకుముందు కార్మిక నాయకులు బి. సత్యానందం నీతి కథలను చెప్పారు. చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు.

విద్యార్థులకు మెడికల్ క్యాంపు

సబ్బవరం : స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు గురువారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వై స్వర్ణలత హాజరై విద్యార్థులకు ఆహారపు అలవాట్లు, ఆరోగ్యంపై పలు సూచనలు అందించారు. అనంతరం విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎస్ రాంబాబు, రత్నకుమార్, పీహెచ్ఎం రత్న బాయి, ఏఎన్ఎం అనురాధ, ఆశ్యా వర్కర్ సూర్యకుమారి, దుర్గాదేవి, శాంతకుమారి, స్థానిక గ్రంథాలయ అధికారి వి. శిరీష తదితరులు పాల్గొన్నారు.

భానుడు భగభగలు

ఉక్కపోతతో ప్రజలు విలవిల

ప్రజాశక్తి- కె.కోటపాడు

గత నాలుగు రోజుల నుండి భానుడు భగభగ మండిపోతున్నాడు. అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఆపై ఉక్కపోత అధికంగా ఉండటంతో చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కె.కోటపాడులో గురువారం 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దేవరాపల్లి, చీడికాడ, కె.కోటపాడు, మాడుగుల మండలాల్లో ఈ నాలుగు రోజుల నుండి 39 నుండి 42 డిగ్రీల మధ్య గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వర్షాలు వల్ల రెండు మూడు రోజులు చల్లబడిన వాతావరణం ఈనెల 26 నుండి మళ్లీ వేడెక్కింది. బయటకు రావాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. ఉదయం 9 గంటలకే భానుడు భగభగలతో ప్రజలు ఇంటికే పరిమితమవుతున్నారు. సప్లిమెంటరీ పరీక్షలు రాస్తున్న పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే ప్రయాణాలు చేస్తున్నారు. రోడ్ల పక్కన చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారు అధిక ఉష్ణోగ్రతలకు భయపడి మధ్యాహ్న మూసివేసి, సాయంత్రం వేళల్లో మాత్రమే దుకాణాలు తెరుస్తున్నారు. రానున్న రెండు మూడు రోజులు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలు ఉన్నాయని వాతావరణ విభాగం అధికారులు చెబుతుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

కొనసాగుతున్న పాలిసెట్ కౌన్సెలింగ్

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి మండలం రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలీసెట్ విద్యార్థులకు కౌన్సిలింగ్ కొనసాగుతుంది. గురువారం 43 వేల ఒకటవ ర్యాంకు నుంచి 59 వేల ర్యాంకు వరకు 112 మంది విద్యార్థులు హాజరయ్యారు. 71 మంది బాలురు 41 మంది బాలికలు హాజరు కాగా వారి ధ్రువపత్రాలను పరిశీలించి ఐసిఆర్ పత్రాలను అందించినట్టు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఐవిఎస్ ఎస్ శ్రీనివాసరావు తెలిపారు. కాగా శుక్రవారం 59 వేల ఒకటవ ర్యాంకు నుంచి 75 వేల ర్యాంకు వరకు కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు ఉదయం 9 గంటలకల్లా తమ ధ్రువపత్రాలతో హాజరుకావాలని తెలియజేశారు.

రైతు కూలీ సంఘం రాష్ట్ర మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-చోడవరం

జూన్ 15, 16, 17 తేదీలలో ఏలూరులో జరిగే రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర మహాసభలకు సంబంధించినవ వాల్ పోస్టరును మండలంలోని చోడవరం శివారు రేవళ్ళులో గురువారం ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ మహాసభలకు రాష్ట్ర నలుమూలల నుండి పెద్ద ఎత్తున రైతు కూలీల హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్ రావు, సహాయ కార్యదర్శి కిల్లి దేముళ్ళు, ఏఐఎఫ్‌టియు (న్యూ) నాయకులు అయితిరెడ్డి అప్పలనాయుడు, రైతు కూలీ సంఘం సభ్యులు లెక్కల వెంకటరమణ, గనిరెడ్డి వెంకునాయుడు, అధిక సంఖ్యలో మహిళా కూలీలు పాల్గొన్నారు.

స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్‌లో 74 మంది ఎంపిక

ప్రజాశక్తి- సబ్బవరం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకులాల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి గురువారం సబ్బవరం గురుకుల విద్యాలయంలో నిర్వహించిన స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్‌లో 74 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. అంబేద్కర్ గురుకుల కళాశాలల్లో 2024-25 విద్యాసంవత్సరానికి ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిధిలోని నాలుగు బాలురు గురుకుల (సబ్బవరం, దేవరాపల్లి, గొలుగొండ, శ్రీకృష్ణాపురం) విద్యాలయాల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్లు కోసం నిర్వహించిన ఈ స్పాట్ అడ్మిషన్లకు 150 మంది విద్యార్థులు హాజరయ్యారు. నాలుగు గురుకులాల్లో 108 సీట్లు ఖాళీగా ఉండగా, మెరిట్ ఆధారంగా, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు అనుగుణంగా 74 మంది విద్యార్థులు ప్రవేశం పొందినట్లు ప్రిన్సిపాల్ సి.హెచ్ వి.వి సత్యారావు తెలిపారు. ఉమ్మడి జిల్లా గురుకులాల సమన్వయకర్త యస్.రూపవతి కౌన్సిలింగ్ ఛైర్మన్‌గా, బాలురు గురుకులాల ప్రిన్సిపల్స్ ఆర్ రామకృష్ణ, సిహెచ్. రవీంద్రనాద్, వి రత్నవల్లిలు కమిటీ సభ్యులుగా వ్యవహరించారు.



విద్యార్థులకు ఎంపిక పత్రాలు అందజేస్తున్న రూపవతి

ఉపాధి హామీ కూలీల ఆందోళన

ప్రజాశక్తి-కోటవురట్ల:కనీస కూలి దక్కలేదని మండలంలోని రాజుపేట గ్రామంలో ఉపాధి హామీ కూలీలు గురువారం ఉపాధి పనుల వద్ద ఆందోళన నిర్వహించారు. గడచిన రెండు నెలలుగా ఉపాధి కూలీలకు వంద రూపాయలు కూడా దక్కక పోవడంతో కూలీలు ఆవేద వ్యక్తం చేశారు. ఉపాధి కూలీలకు కూలి రోజకు రూ. 300 వరకు చెల్లించాలని నిబంధన ఉన్నా టెక్నికల్ అసిస్టెంట్ కావాలనే తప్పుడు కొలతలు వేసి వంద రూపాయలు కూడా దక్కకుండా చేస్తున్నారని కూలీలు తెలిపారు. ఇది ఎంత మాత్రం సమంజసం కాదని సమగ్ర విచారణ చేపట్టి కనీస కూలి దక్కే విధంగా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తామని కూలీలు హెచ్చరించారు.ఉపాధి పనుల వద్ద కనీస వసతులు కూడా కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ విషయమై ఏపీవో గంగు నాయుడును వివరణ కోరగా గ్రామంలో ఉపాధి కూలీలకు వారానికి దాదాపు 1500 వరకు చెల్లిస్తున్నామన్నారు. చెరువు పనుల వద్ద చేపట్టిన క్వాంటిటీ ప్రకారం చెల్లించడంతో పాటు రవాణా చార్జీలు చెల్లిస్తున్నామన్నారు. ఉపాధి పనుల వద్ద కూలీలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వసతులు కల్పిస్తామని తెలిపారు.


ఆందోళన చేపడుతున్న కూలీలు

మూడు నెలలకే కూలిన డ్రైయినేజీ

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని కొంతలం గ్రామంలో డ్రైనేజీ నిర్మాణం చేపట్టిన మూడు మాసాలకే కూలి పోవడంపై గ్రామస్థులు విస్మయం వ్యక్తం చేశారు. కొంతలం గ్రామ చివరి పొలాల వద్ద ఫిబ్రవరి నెలలో ఆర్థిక సంఘం నిధులు రూ.2లక్షలతో సుమారు 100 మీటర్ల పొడవున డ్రైనేజీ నిర్మించారు. అడుగు భాగాన కాంక్రీటు వేయకపోవడం, నాశిరకం గా చెరువు ఇసుక వాడటంతో ఇటీవల కురిసిన వర్షానికి కూలి పోయిందని గ్రామస్థులు తెలిపారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎస్.వెంకట్రావును వివరణ కోరగా ఆ డ్రైనేజీ బిల్లు పాసవలేదన్నారు. అధికారుల ఆర్డర్ లేకుండా పంచాయతీ తీర్మానంతో సర్పంచ్ తండ్రి కుంచంగి హరిబాబు నిర్మాణం చేపట్టారని, పనులు పూర్తి కాలేదని, డ్రైనేజీ నిర్మాణం జరిగిన వెంటనే ఇరువైపులా మట్టి వేయకపోవడంతో ఈ వర్షాలకు కొట్టుకు పోయిందని ఆయన తెలిపారు.



కూలిన డ్రైయినేజీ

ఆర్‌ఎంపిల క్లినిక్‌లకు అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి-గొలుగొండ:ఆర్‌ఎంపి వైద్యులు క్లినిక్‌లు నిర్వహించాలంటే తప్పనిసరిగా జిల్లా ఆరోగ్య వైద్యాధికారి అనుమతులు తీసుకోవాలని కృష్ణదేవిపేట పిహెచ్‌సి వైద్యాధికారి హరిప్రవీణ్ సూచించారు. కృష్ణదేవిపేటలో మూడు రోజుల క్రితం నిర్లక్ష్యంతో వైద్యం చేశారనే కారణంతో అల్లూరి క్లినిక్‌ను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీజ్ చేశారు. సదరు క్లినిక్ రెండు రోజుల అనంతరం తిరిగి తెరవడంపై అధికారుల ఆదేశాలు పట్టించుకోకపోతే తీవ్ర చర్యలు తప్పవని హెచ్చరించారు. అల్లూరి క్లినిక్‌కు సంబంధించిన దృవపత్రాలతో డిఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయానికి హాజరు కావాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, కృష్ణదేవిపేట పరిసర ప్రాంతాల్లో క్లినిక్‌లు నిర్వహిస్తున్న ఆర్‌ఎంపి వైద్యులందరూ తమ వద్ద ఉన్న అర్హత దృవపత్రాలతో డిఎంఅండ్‌హెచ్‌ఒ కార్యాలయానికి హాజరు కావాలని చెప్పారు. ఆ దృవపత్రాలను డిఎంఅండ్‌హెచ్‌ఒ పరిశీలించిన అనంతరం అనుమతి ఇస్తారన్నారు. లేనిపక్షంలో కృష్ణదేవిపేటలో నిర్వహిస్తున్న క్లినిక్‌లపై చర్యలు తీసుకుంటామన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని పెదదొడ్డిగల్లు, సీతంపాలెం గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయితీ సర్పంచ్ భర్త నాగ అప్పలరాజు తెలిపారు. గురువారం గ్రామంలో జల జీవన్ మిషన్‌లో భాగంగా బోర్ వెల్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాగ అప్పలరాజు మాట్లాడుతూ, మోటార్ ద్వారా వాటర్ ట్యాంకుకు నీరు ఎక్కించి ఇంటింటికి కుళాయిల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తామన్నారు. దీంతో రెండు గ్రామాల్లోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా ఉంటుందన్నారు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు .


బోర్ వెల్ పనులు పారంభిస్తున్న అప్పలరాజు

నిలిచిన సచివాలయ భవన నిర్మాణాలు

-గడ్డ కట్టి పాడవుతున్న సిమెంట్ బస్తాలు -పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని కొవ్వూరు, కె.అడ్డసరం గ్రామాల్లోని సచివాలయ కేంద్ర భవనాలు పునాదుల్లోనే దర్శనమిస్తున్నాయి. ఈ ఐదేళ్ల కాలంలో నిర్మాణం జరగలేదు. కొవ్వూరు సచివాలయ భవనం స్థలంపై అదే గ్రామానికి చెందిన వైసిపి నేత కోర్టుకు వెళ్లడంతో పనులు నిలిపివేశారు. దీంతో ఈ గ్రామంలో గత పంచాయతీ కార్యాలయంలోనే సచివాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఇది ఇరుగ్గా ఉండటంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

కె.అడ్డసరం సచివాలయంకు సంబంధించి గుత్తేదారుడు చేతులెత్తేయడంతో పిల్లర్ల దశలోనే పనులు నిలిపివేశారు. ఆ భవనంకు చెందిన మెటీరియల్, ఇసుక వేరే ప్రాంతానికి తరలించారని, సిమెంట్ బస్తాలు గ్రామంలోని పాఠశాల శిధిలావస్థ భవనంలో ఉంచడంతో వర్షాలకు తడిసిముద్దయి గడ్డ కట్టి పాడై పోతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి భవనాలు పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.


పాడవుతున్న సిమెంట్ బస్తాలు


కె.అడ్డసరంలో పిల్లర్ దశలో నిలిచిన సచివాలయ భవనం


పారిశుధ్య పనులు చేపడుతున్న కార్మికులు

ఎఎల్.పురంలో పారిశుధ్య పనులు

-ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-గొలుగొండ:మండలం ఏఎల్ పురం మేజర్ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శి వై శ్రీను ఆధ్వర్యంలో గురువారం ముమ్మరంగా పారిశుధ్య పనులను చేపట్టారు. ఏఎల్ పురంలో 'అపారిశుద్యంతో అవస్థలు' అనే శీర్షికన ప్రజాశక్తిలో వెలువడిన కథనానికి స్పందించి పనులు చేపట్టారు. ఈ సందర్భంగా కాలువల్లో పూడికతీత తీసి శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా కార్యదర్శి శ్రీను ప్రజాశక్తితో మాట్లాడుతూ పంచాయతీలో మూడు రోజులు పాటు పూర్తిస్థాయిలో పారిశుధ్య పనులను చేస్తామన్నారు.


మాట్లాడుతున్న డిఎస్‌పి మోహన్

పలు ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ - వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:పెదబొడ్డేపల్లి యాతపేటలో గురువారం డీఎస్పీ మోహన్ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, 37 వాహనాలు స్వాదీనం చేసుకున్నామన్నారు. మూడు లీటర్ల నాటుసారా స్వాదీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇంత వరకు 16 రౌడీషీట్లు, ఐదు సస్పెక్ట్ షీట్లు ఓపెన్ చేసినట్లు చెప్పారు. కౌంటింగ్ పూర్తయ్యే వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ప్రజలందరూ సహకరించాలని కోరారు. ప్రతీ రోజు నర్సీపట్నం డివిజన్‌లో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం టౌన్ సీఐ కాంతికుమార్, ఎస్సై సుధాకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కశింకోటలో 48 వాహనాలు స్వాధీనం

కశింకోట : కసింకోటలోని హౌసింగ్ కాలనీ, సత్తమ్మ కాలనీ, గవరపేట, ఎస్‌సి కాలనీ ప్రాంతాల్లో గురువారం ఉదయం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. రికార్డుల్లేని 46 ద్విచక్ర వాహనాలు, కారు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఆ వాహనాలకు సంబంధించిన రికార్డులు పట్టుకొని పోలీస్ స్టేషన్ వచ్చి వాహనాలు తీసుకెళ్లాలని పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో కశింకోట సిఐ వినోద్ బాబు, ఎస్‌ఐ రమేష్ బాబు, అనకాపల్లి టౌన్ ఎస్‌ఐ అలీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన క్రీడాకారుల ప్రతిభ

ప్రజాశక్తి - అరకులోయ : ఖేలో భారత్ యూత్ గేమ్స్ ఫెడరేషన్ ఇండియా ఆధ్వర్యంలో ఉత్తప్రదేశ్ రాష్ట్రం వారణాసిలో ఖేలో భారత్ యూత్ గేమ్స్ నేషనల్ ఛాంపియన్ షిప్ నిర్వహించారు. అథ్లెటిక్స్ విభాగం 10 కిలో మీటర్ల పరుగు పందెంలో అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలం పెదలబుడు పంచాయితీ గరుడగుడ గ్రామానికి చెందిన కీల్లో బుద్ధు ప్రథమ స్థానం సాధించాడు. 5 కిలోమీటర్ల విభాగంలో అనంతగిరి మండలం కొత్తూరు పంచాయతీ తుమ్మనవలస గ్రామానికి చెందిన కొర్ర గోపి అనే గిరిజన యువకుడు ప్రథమ స్థానం సాధించినట్లు విజేతలు బుద్ధు, గోపిలు గురువారం విలేకరులకు తెలిపారు.



ప్రతిభ చాటిన క్రీడాకారులు

చిటికె వ్యాధి నివారణకు టీకాలు వేయించాలి

ప్రజాశక్తి - మాడుగుల : గొర్రెలు, మేకలలో చిటికె వ్యాధి నివారణకు టీకాలను వేయించాలని పాడేరు డివిజన్ ఉపసంచాలకులు డాక్టర్ సిహెచ్ నరసింహులు కోరారు. గురువారం మండలంలోని గొటివాడ అగ్రహారం, సత్యవరం గ్రామాలలో చిటికె వ్యాధి నివారణ టీకాలను ప్రారంభించారు. గోటివాడ అగ్రహారం, సత్యవరం గ్రామాలలో 340 గొర్రెలు, మేకలకు టీకాలు వేశామని మాడుగుల ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ చిట్టినాయుడు తెలిపారు. ఇప్పటి వరకు మండలంలోని 6,540 గొర్రెలు, మేకలకు చిటికె వ్యాధి నివారణ టీకాలు వేశామన్నారు. పశుసంవర్థక సహాయకులు మోది నాయుడు, చంద్రరావు పాల్గొన్నారు.

ఉద్యోగవిరమణ శుభాకాంక్షలు



శ్రీమతి & శ్రీ ఈర్లె అప్పారావు - లక్ష్మి దంపతులు
ప్రధానోపాధ్యాయులు (H.M)
Z.P.H. SCHOOL చౌడువాడ, కె.కోటపాడు మండలం,



ఉపాధ్యాయ వృత్తిలో 44 సం॥రాలు సుదీర్ఘ సేవలందించి, ఎందరో విద్యార్థులను తీర్చిదిద్ది, విద్యారంగానికే వన్నెతెచ్చిన మా నాన్నగారు శ్రీ ఈర్లె అప్పారావు గార్కి హృదయపూర్వక ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు

డా॥ రవిచంద్రశేఖర్-లావణ్య
Medical Officers, G.మాడుగుల
మరియు బంధుమిత్రులు

ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు



శ్రీమతి & శ్రీ కూన సత్యనారాయణ - పార్వతి దంపతులు
UNITED PORT & DOCK EMPLOYEES UNION GENERAL SECRETARY
LASCAR GR-1 / MARINE SURVEY SECTION
MARINE DEPARTMENT, VSP PORT AUTHORITY

ఉద్యోగ నిర్వహణలో విశిష్ట సేవలందించి అందరి మన్ననలు పొంది నేడు "ఉద్యోగ విరమణ" చేయుచున్న శ్రీ కూన సత్యనారాయణ-పార్వతి దంపతులకు "మా హృదయపూర్వకశుభాకాంక్షలు"

సనపల రామ్‌గోపాలరావు
శ్రీ మాధవ యువజన సమాజం కన్వీనర్
శ్రీ మాధవ యువజన సమాజం మాజీ అధ్యక్షులు
మాధవధార

ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు



శ్రీమతి & శ్రీ కూన సత్యనారాయణ - పార్వతి దంపతులు
UNITED PORT & DOCK EMPLOYEES UNION GENERAL SECRETARY
LASCAR GR-1 / MARINE SURVEY SECTION
MARINE DEPARTMENT, VSP PORT AUTHORITY

ఉద్యోగ నిర్వహణలో విశిష్ట సేవలందించి అందరి మన్ననలు పొంది నేడు "ఉద్యోగ విరమణ" చేయుచున్న శ్రీ కూన సత్యనారాయణ-పార్వతి దంపతులకు "మా హృదయపూర్వకశుభాకాంక్షలు"

సీపాన అప్పలస్వామి
S/o. (Late) నరసింహం
A.P.E.P.D.C.L.
A.P.E.E.1104, Union President
Zone - 3, Visakhapatnam.

ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు



శ్రీమతి & శ్రీ కూన సత్యనారాయణ - పార్వతి దంపతులు
UNITED PORT & DOCK EMPLOYEES UNION GENERAL SECRETARY
LASCAR GR-1 / MARINE SURVEY SECTION
MARINE DEPARTMENT, VSP PORT AUTHORITY

ఉద్యోగ నిర్వహణలో అంకిత భావంతో పని చేసి 34 సంవత్సరాల ఉద్యోగ జీవితంలో అలుపెరగని పోరాటయోధునికి ఉద్యోగవిరమణ శుభాకాంక్షలు తెలియజేస్తూ... మీ భావిజీవితం ఆనందమయం కావాలని కోరుకుంటూ...

కామ్రేడ్ వి.ఎస్.పద్మనాభరాజు Rtd. VPA
కామ్రేడ్ కొసరాజు స్వతంత్రకుమార్ Rtd. VPA
కామ్రేడ్ పి.వి.రమణ Rtd. VPA
కామ్రేడ్ జి.సిహెచ్.వై. నాయుడు Rtd. VPA
కామ్రేడ్ సాధుబాబు Rtd. VPA
కామ్రేడ్ ఈటి రాంబాబు Rtd. VPA
కామ్రేడ్ వి.రామలింగేశ్వరరావు AQF., TM Dept. VPA
కామ్రేడ్ డి.సాంబమూర్తి అసిస్టెంట్ ఫోర్మాన్ TXR/BGL. VPA
కామ్రేడ్ జక్కాన సత్యనారాయణ రిటైర్డ్ CHD., VPA
కామ్రేడ్ సిహెచ్.త్రినాధరావు STK, T&FC Section, VPA
కామ్రేడ్ సనపల ఆనంద్ Rtd. VPA
కామ్రేడ్ బి.జగన్ కార్యదర్శి, సిఐటియు

ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు



నేడు "ఉద్యోగ విరమణ" చేయుచున్న శ్రీ కూన సత్యనారాయణ-పార్వతి దంపతులకు "మా హృదయపూర్వక శుభాకాంక్షలు" మీ భావి జీవితం సంపూర్ణ ఆయురారోగ్యలతో ఆనందంగా ఉండాలని మనసారా కోరుకుంటూ...

శ్రీమతి & శ్రీ కూన సత్యనారాయణ - పార్వతి దంపతులు
UNITED PORT & DOCK EMPLOYEES UNION GENERAL SECRETARY
LASCAR GR-1 / MARINE SURVEY SECTION
MARINE DEPARTMENT, VSP PORT AUTHORITY

సనపల ఆంజనేయులు Rtd. HSL	గనివాడ నాయుడుబాబు Rtd. ND(V)
పప్పల రామచంద్రరావు Rtd. O.S.Eco. Rly	పేడాడ పాండురంగారావు Rtd. Steelplant
బొడ్డేపల్లి త్రినాధస్వామి Rtd. Eco. Rly	పి.వి.రమణ (రాజు) Rtd. Steelplant
కూన వెంకటరావు Rtd. Steelplant	పప్పల సత్యప్రసాదరావు Eco.Rly
ఎస్.టి.వి.రమణమూర్తి Rtd. Steelplant	సనపల కులత్వార్‌స్వామి Teacher
కె.సుధాకర్‌రావు APRPA రాష్ట్ర కార్యదర్శి Rtd. HSL	సనపల హరిబాబు Prajasakti

ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు

ఉద్యోగ నిర్వహణలో విశిష్ట సేవలందించి అందరి మన్ననలు పొంది మాకు బంగారు భవిష్యత్తును ప్రసాదించి నేడు "ఉద్యోగ విరమణ" చేయుచున్న మా తండ్రిగారైన శ్రీ డి.వెంకటరావు గార్కి ఇవియే "మా హృదయపూర్వక శుభాకాంక్షలు" మీ బావి జీవితం సంపూర్ణ ఆయురారోగ్యలతో ఆనందంగా ఉండాలని మనసారా కోరుకుంటూ...



శ్రీమతి & శ్రీ డి. వెంకటరావు గారు
Dy. Mgr (O) ASP (O) E.NO: 104843
UTILITIES Dept.
Visakhapatnam Steelplant



శ్రీ డి.ఎస్. భార్గవ M.tech
శ్రీమతి Dr.రమ్య MD. psychiatrist



శ్రీ డి.వి. రఘువ B. tech
శ్రీమతి దివ్య శ్రీ B. tech

ఉద్యోగవిరమణ శుభాకాంక్షలు



ఉద్యోగ నిర్వహణలో అంకిత భావంతో పని చేసి అందరి మన్ననలు పొంది నేడు "ఉద్యోగ విరమణ" చేయుచున్న శ్రీ కూన సత్యనారాయణ-పార్వతి దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ.. మీ భావి జీవితం సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని కోరుకుంటూ..

శ్రీమతి & శ్రీ కూన సత్యనారాయణ - పార్వతి దంపతులు
UNITED PORT & DOCK EMPLOYEES UNION GENERAL SECRETARY
LASCAR GR-1 / MARINE SURVEY SECTION
MARINE DEPARTMENT, VSP PORT AUTHORITY

తమ్ముళ్ళు - మరదళ్లు
కూన శ్రీనువాసరావు - లలిత
కూన జగన్నాధరావు - ఉషారాణి

తమ్ముళ్లు - మేనకోడల్లు
బగాతి ఉపేంద్ర - స్రవంతి
పేడాడ సూర్యనారాయణ-అశ్వినీ
కంచరాన అరుణకుమారి-శ్రీనివాస్

అక్కలు : ఎదురువలస హైమవతి
కంచరాన వరలక్ష్మీ
చెల్లి : యండ సూర్యకళ
బావ : ఈశ్వరరావు

ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు



ఉద్యోగ నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి అందరి మన్ననలు పొంది నేడు "ఉద్యోగ విరమణ" చేయుచున్న మీకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ... మీ బావి జీవితం ఆనందమయం కావాలని కోరుకుంటూ..

అత్తయ్య: బొడ్డేపల్లి కృష్ణవేణి
మావయ్య: బొడ్డేపల్లి నరసింగరావు (లేటు) Rtd. HZL, Comrade

శ్రీమతి & శ్రీ కూన సత్యనారాయణ - పార్వతి దంపతులు
UNITED PORT & DOCK EMPLOYEES UNION GENERAL SECRETARY
LASCAR GR-1 / MARINE SURVEY SECTION
MARINE DEPARTMENT, VSP PORT AUTHORITY

పెద్ద బావమరిది : బొడ్డేపల్లి రమేష్‌కుమార్
చెల్లి : బొడ్డేపల్లి త్రివేణి
మేనకోడలు : బొడ్డేపల్లి యుతిక
మేనల్లుడు : బొడ్డేపల్లి దేవాన్ష్

చిన్న బావమరిది (అల్లుడు) : బొడ్డేపల్లి రాంప్రసాద్
కుమార్తె : బొడ్డేపల్లి సమత
మనమరాలు : బొడ్డేపల్లి దివాన్విత